జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన
నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకొంటున్నారా?
మీ ఏరియాలోని ప్రజల సమస్యలను మీ కలం ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్లాలి అనుకుంటున్నారా ?ఇంకెందుకు ఆలస్యం మీ ఏరియాకు మీరే రిపోర్టర్... రండి ..ప్రజాపాలన దినపత్రిక మీకు అవకాశం కల్పిస్తుంది
వివరాలకు సంప్రదించండి 8886022523

సంపుటి 6 సంచిక 23 | హైదరాబాద్, నవంబరు 18 శుక్రవారం 2022 | 8 పేజీలు | వెల : 5.00

## గవర్నర్లు ఆర్ఎస్ఎస్ ఎజెండా అమలు చేస్తున్నారు : డీ రాజా



హైదరాబాద్ : తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల గవర్నర్లు ఆర్ఎస్ఎస్ ఎజెండా అమలు చేస్తున్నారని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డీ రాజా ధ్వజమెత్తారు. తెలంగాణ, కేరళ గవర్నర్లు.. ఆయా రాష్ట్రాల పాలనలో జోక్యం చేసుకుంటున్నారు. ఇది సరైంది కాదని పేర్కొన్నారు. హైదరాబాద్ డీ రాజా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ.. కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థలను లూటి చేస్తు కార్పొరేట్ శక్తులకు అమ్ముతుందని మండిపడ్డారు. దేశంలో రోజురోజుకు నిరుద్యోగం పెరిగిపోతుందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని 2014 ఎన్నికల సందర్భంగా మోదీ హామీ ఇచ్చారు. కానీ ఆ హామీని మోదీ నెరవేర్చలేకపోయారని నిప్పులు చెరిగారు. మోదీ విధానాల వలన రూపాయి విలువ పతనమైందన్నారు. ఒకే దేశం ఒకే పన్ను విధానం అమలు చేయడంతో రాష్ట్రాలకు నిధులు రావడం లేదన్నారు. ప్రాంతీయ, జాతీయ పార్టీలు కలిసి బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతామన్నారు. 2024లో మోదీని గద్దె దింపుతామన్నారు. బీజేపీ ప్రజాస్వామ్యాన్ని భ్రష్టు పట్టిస్తుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని రాజా పేర్కొన్నారు.

## నూతన సచివాలయాన్ని పరిశీలించిన కేసీఆర్

### ఫిబ్రవరి నాటికి పూర్తి..!



హైదరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్ నగరం నడిబొడ్డున నూతనంగా నిర్మిస్తున్న సచివాలయం వద్దకు చేరుకున్నారు. ఈ మేరకు జరుగుతున్న కొత్త సచివాలయ నిర్మాణ పనులను ఆయన పరిశీలిస్తున్నారు. అనంతరం పనులు జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. సెక్రటేరియట్ నిర్మాణంలో అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్న సంగతి తెలిసిందే.

## రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 18 నుంచి కంటి వెలుగు కార్యక్రమం



హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే ఏడాది జనవరి 18 నుంచి కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని మళ్లీ నిర్వహించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. కంటి వెలుగు కార్యక్రమం అమలు తీరుపై సీఎం కేసీఆర్ ఇవాళ సమీక్షిం చారు. ప్రజారోగ్యంపై వైద్య ఆరోగ్య శాఖ, ఇతర మంత్రులతో కేసీఆర్ సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా కంటి వెలుగు కార్యక్రమం మళ్లీ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు.కంటి వెలుగు పథకాన్ని 2018, ఆగస్టు 15న మెదక్ జిల్లా మల్కాపూర్‌లో సీఎం కేసీఆర్ ప్రారంభించిన విషయం విదితమే. అయితే.. ఈ పథకం ఐదు నెలల పాటు కొనసాగింది. కంటి వెలుగు కోసం ప్రభుత్వం రూ.106 కోట్లు ఖర్చు చేసింది కూడా. అయితే.. పథకంలో భాగంగా కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి కళ్లద్దాలతో పాటు మందులు కూడా పంపిణీ చేసింది ప్రభుత్వం. ఈ కార్యక్రమం అప్పుడు విజయవంతమైంది.

### ఎమ్మెల్యేల ఎర కేసులో..

## సిట్ దర్యాప్తు వేగవంతం



హైదరాబాద్: ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో సిట్ దర్యాప్తును ముమ్మరం చేసింది. తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అనుచరుడు శ్రీనివాస్‌కు గురువారం సిట్ నోటీసులు ఇచ్చింది. నవంబర్ 21న ఉదయం 10:30కి విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. ఈ కేసులో ఏ1గా ఉన్న రామచంద్రభారతికి శ్రీనివాస్ ఫ్లైట్ టికెట్లు కొనుగోలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఇదిలా ఉంటే, ఎమ్మెల్యేలకు ఎర కేసులో పోలీసులు మరో ఇద్దరిని ఢిల్లీలో అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో అరెస్టయి విచారణ ఎదుర్కొంటున్న నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు వీరిద్దరిని ఫరీదాబాద్ ప్రాంతంలో అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు ఢిల్లీ పోలీసు వర్గాల సమాచారం.వీరిద్దరూ కేసులో ప్రథమ ముద్దాయిగా ఉన్న రామచంద్రభారతికి అత్యంత సన్నిహితులుగా చెబుతున్నారు. ఈ ఇద్దరికీ కేసులో సహ నిందితుడిగా ఉన్న నందుకుమార్‌తోనూ సాన్నిహిత్యం ఉన్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేల ఎర కేసును తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక విచారణ బృందం (సిట్)కు అప్పగించిన మరుసటి రోజునే సైబరాబాద్‌కు చెందిన ప్రత్యేక బృందం ఒకటి ఢిల్లీకి చేరుకొని విచారణ చేపట్టింది. నిందితులు ఇచ్చిన ప్రాథమిక సమాచారం, కాల్‌డేటా ఆధారంగా ఫరీదాబాద్‌లో వీరిని అదుపులోకి తీసుకుంది. వీరికి ముగ్గురు ముద్దాయిలతో ఉన్న సాన్నిహిత్యం, ఎమ్మెల్యేల కొనుగోళ్లలో వీరి ప్రమేయం తదితర వివరాలపై ఆరా తీస్తోంది.

## సరికొత్త శకానికి నాంది పలికిన ఇస్రో..

### తొలి ప్రైవేట్ రాకెట్ ప్రయోగానికి సర్వం సిద్ధం



సూళ్లూరుపేట (శ్రీహరికోట), : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో సరికొత్త శకానికి నాంది పలికింది. తొలిసారిగా ప్రైవేట్ రాకెట్ ప్రయోగాన్ని చేపట్టబో తుంది. అంతరిక్ష ప్రయోగాల్లో అగ్ర రాజ్యా లకు ధీటుగా దూసుకుపోతున్న ఇస్రో, దేశీయంగా తయారు చేసిన తొలి ప్రైవేట్ రాకెట్‌ను రోదసిలోకి పంపనున్న నేపథ్యంలో విశ్వవ్యాప్తంగా ఖగోళ శాస్త్రవేత్తలు భారత్‌వైపు చూస్తున్నారు. తొలి ప్రైవేట్ రాకెట్ ప్రయోగానికి శ్రీహరికోట అంతరిక్ష ప్రయోగం షార్ వేదికగా నిలిచింది. హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరో స్పేస్ సంస్థ రూపొందించిన ప్రైవేట్ రాకెట్ విక్రమ్ -ఎస్ ప్రయోగానికి ఇప్పటికే సర్వం సిద్ధం చేశారు. అన్ని సాంకేతిక అంశాలు సమకూరిన నేపథ్యంలో వాతావరణం అనుకూలిస్తే రేపు (శుక్రవారం) ఉదయం 11.30గంటలకు విక్రమ్ -ఎస్ రాకెట్ నింగిలో దూసుకెళ్ల నుంది.శ్రీహరికోట అంతరిక్ష ప్రయోగ కేంద్రం (షార్)లోని సౌండ్ రాకెట్ క్లాంప్లెక్స్ నుంచి ఈ రాకెట్‌ను ప్రయోగించనున్నారు. ఇందుకోసం షార్‌లో శాస్త్రవేత్తలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. హైదరాబాద్‌లోని స్కైరూట్ ఏరోస్పేస్ అనే ప్రైవేటు సంస్థ అభివృద్ధి చేసిన ఈ రాకెట్ దేశంలోనే తొలి ప్రైవేట్ రాకెట్ కావడం విశేషం. 6 మీటర్ల పొడవు, 545 కిలోల బరువు గల విక్రమ్ -ఎస్ రాకెట్ భూమికి 103 కిలోమీటర్ల ఎత్తులోని ఆర్బిట్‌లో ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టనుంది. అక్కడి నుంచి తిరిగి సముద్రంలో శ్రీహరికోటకు 115.8 కిలోమీటర్ల దూరంలో పడిపోనుంది. మొత్తం ఈ ప్రయోగాన్ని 4.50 నిమిషాలలో పూర్తి చేసేలా శాస్త్రవేత్తలు చర్యలు చేపట్టారు. ప్రైవేటు రాకెట్లను అంతరిక్షంలోకి పంపనున్న ఈ ప్రయోగంపై ఖగోళ ఔత్సాహికులలో ఆసక్తిని కలిగించింది.

## హైదరాబాద్ వాసులూ బీ రెడీ..

### మాంచి థ్రిల్లింగ్ ఇవ్వనున్న రేసింగ్..



హైదరాబాద్:ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో రూపొందిన ట్రాక్‌లో.. రేస్ కార్లు భాగ్యనగరంలో రయ్.. రయ్‌మంటూ దూసుకుపోనున్నాయి. హుస్సేన్ సాగర్ చుట్టూ పవర్‌ఫుల్ ట్రాక్ దాదాపుగా రెడీ ఐపోయింది. చిరుతలా పరుగెత్తే రేసింగ్ వెహికల్స్‌ను మరో రెండు రోజుల్లో వీక్షించబోతున్నారు హైదరాబాదీలు. ఫార్ములా రేసింగ్‌కు భాగ్యనగరం అడ్డాగా మారబోతోంది. ఈ వీకెండ్‌లో జరిగే రేసింగ్ ట్రయల్‌రన్ కోసం ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ట్రాక్.. సిట్టింగ్ గ్యాలరీలతో పాటు సర్వం సిద్ధమవుతున్నాయి. ఫార్ములా-ఈ చాంపియన్‌షిప్‌లో భాగంగా ఈనెల 19, 20 తేదీల్లో జరిగే ట్రయల్ రన్ కోసం గెటింగ్ రెడీ అంటోంది హుస్సేన్ సాగర తీరం.ఫార్ములా ఈ-ట్రయల్ రన్ కోసం ఇటలీ నుంచి 14మందితో కూడిన టీమ్ హైదరాబాద్ చేరుకుంది. వాళ్లకు సంబంధించిన స్పోర్ట్స్ ఈ-కార్లు ఇవాళ హైదరాబాద్‌కు చేరుకోనున్నాయి. కార్లు వచ్చాక డ్రైవింగ్ మొదలు పెడతామంటున్నారు రేసర్లు. మొత్తం 11 టీమ్‌లు పాల్గొనబోయే ఈ రేస్‌లో ఒక్కో టీమ్‌లో రెండు కార్లు, నలుగురు డ్రైవర్లు ఉంటారు. ఇండియాకు చెందిన 10 మంది డ్రైవర్లు కూడా రేస్‌లో పాల్గొననున్నారు. ఏడుగురు మహిళా రేసర్లు కూడా ఉన్నారు.

ట్రాఫిక్ ఆంక్షలు..

ఈ ట్రయల్ రన్ నేపథ్యంలో ఆదివారం వరకు ఎన్టీఆర్ మార్గ్ రూట్‌లో ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఐమాక్స్ రోటరీ నుంచి తెలుగుతల్లి జంక్షన్, కొత్త సెక్రటేరియట్, ఎన్టీఆర్ గార్డెన్, మింట్ కాంపౌండ్, ఐమాక్స్ రూట్లలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయన్నారు. ఈ నెల 20న రాత్రి 10 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయి. 2.8 కిలోమీటర్ల లూప్, దాదాపు 30కి పైగా రౌండ్స్.. 45 నిమిషాల రేసింగ్.. అదరహో అనే రేంజ్‌లో ఉండబోతోంది భాగ్యనగరంలో ఫార్ములా-ఈ. ఈ రేసును చూసేందుకు వచ్చే విజిటర్స్ కోసం 30 వేలకు పైగా సీట్లు ఎరేంజ్ చేశారు.

## హైదరాబాద్ లో నకిలీ గన్ లైసెన్స్ ముఠా అరెస్ట్



హైదరాబాద్ :నకిలీ గన్ లైసెన్స్ లతో మోసాలకు పాల్పడుతున్న ముఠాను వెస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. గన్ లైసెన్సులు ఇష్యూ చేసే ఉన్నతాధికారుల సంతకాలు, స్టాంపులతో నిరుద్యోగ యువతను మోసం చేస్తున్నట్లు గుర్తించారు. నకిలీ గన్ లైసెన్సులు ఇస్తూ సొమ్ము చేసుకుంటున్న ఆరుగురు ముఠా సభ్యులను పట్టుకున్నారు.ఈ ముఠా నుంచి 33 గన్స్, ఒక రివాల్వర్, 140 బుల్లెట్స్ స్వాధీనం చేసుకున్నారు. సెక్యూరిటీ ఏజెన్సీల్లో పని చేసే వారికి ఇలాంటి గన్ లైసెన్స్ లను అందిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. జమ్మూకశ్మీర్ రాజౌరి జిల్లాకు చెందిన అల్తాఫ్ హుస్సేన్ ప్రధాన నిందితుడిగా గుర్తించారు. వీరితో పాటు మిగితా ఐదుగురు సిటీకి చెందిన సెక్యూరిటీ ఏజెన్సీల ఓనర్లుగా గుర్తించారు. వీరి నుంచి 34 ఫేక్ వెపన్ లైసెన్స్ బుక్స్ స్వాధీనం చేసుకున్నారు.

## తెలుగు రాష్ట్రాలను షేక్ చేస్తోన్న చీకోటి లింకులు..

### ఒక్కొక్కరుగా వెలుగులోకి వస్తున్న రాజకీయ నేతలు..




హైదరాబాద్: చీకోటి ప్రవీణ్ కేసులో ఈడీ స్పీడ్ పెంచింది. క్యాసినో వ్యవహారంలో పొలిటికల్ లింకులే ఎక్కువగా బయటపడుతున్నాయి. కోటి ప్రవీణ్ లిస్ట్‌లో తెలంగాణలోనే కాదు ఏపీలోనూ కీలక నేతలు బయటకు వస్తున్నారు. లింకులు ఉన్న వాళ్లకు ఈడీ నోటీసులు ఇచ్చి ఒకరి తర్వాత ఒకరిని విచారిస్తుండటంతో.. ఆయా నేతల్లో వణుకు మొదలైంది. వైసీపీ మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్ రెడ్డితో పాటు మాజీ ఎంపీ బుట్టా రేణుక సోదరుడు యుగంధర్‌ని కూడా ఈడీ విచారించింది. ఈ యుగంధర్ రెడ్డికి పంజాగుట్టలో ఊర్వశి బార్ కూడా ఉంది. ఫారిన్ ఎక్స్ చేంజ్ మేనేజ్మెంట్ యాక్ట్ ను ఉల్లంఘించారనేది వీళ్లపై ఉన్న ఆరోపణ. చీకోటి కేసినోల్లో పాల్గొనడానికి విదేశాలకు వెళ్లారని.. హవాలా ద్వారా డబ్బులు చెల్లించారన్న ఆరోపణలపై ఈడీ ప్రశ్నించినట్టు తెలుస్తోంది. మళ్లీ ఎప్పుడు కావాలంటే అప్పుడు విచారణకు రావాల్సిందిగా ఈడీ ఆదేశించినట్టు సమాచారం. ఇప్పటికే మంత్రి తలసాని సోదరులు మహేష్, ధర్మేంద్రలను బుధవారం 10 గంటల పాటు అధికారులు విచారించారు. (మిగతా 2లో..)



# తెలుగు రాష్ట్రాలను షేక్ చేస్తోన్న చీకోటి లింకులు..

(మొదటి పేజీ తరువాయి)

క్యాసినోతో పాటు ఆర్థిక లావాదేవీలు, మనీలాండరింగ్, హవాలా చెల్లింపులపై ప్రశ్నల వర్షం కురిపించినట్లు సమాచారం. శుక్రవారం వీళ్లిద్దరినీ మరోసారి విచారించే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు టీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్.రమణ, మెదక్ డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డిలను కూడా శుక్రవారం విచారించబోతున్నారు అధికారులు. చీకోటి ప్రవీణ్, మాధవ్?రెడ్డి కాల్?డేటా ఆధారంగా ఈ కేసు ఎంక్వైరీ జరుగుతోంది. ట్రావెల్ ఏజెన్సీ ద్వారా ఫ్లైట్ బుకింగ్స్ వివరాలు సేకరించిన ఈడీ.. అనుమానితులను విచారణకు పిలుస్తున్నారు. మొత్తంగా ఈ కేసులో ఇప్పటి వరకు వంద మందికి ఈడీ నోటీసులు జారీ చేసింది. నేపాల్ వెళ్లిన కేసీను పాడిన అందరికీ నోటీసులు ఇస్తోంది ఈడీ. రాజకీయ నేతలు, వారితో సంబంధాలున్నవారే ఈ కేసుల్లో ఉన్నారు. నోటీసులు అందిన వారికి సంబంధించి.. 4 సంవత్సరాల ఆర్థిక లావాదేవీలపై ఆరా తీస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో నోటీసులు అందుకున్న వారి పేర్లు బయటకు వచ్చే కొద్దీ సంచలనంగా మారుతోంది. ముందు ముందు మరికొంత మంది విచారణ ఎదుర్కోక తప్పదనే సంకేతాలు కనిపిస్తున్నాయి.

## ముదిరాజ్ మహాసభ వార్షికోత్సవ సభను విజయవంతం చేయండి: గుండ్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్



హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి): నవంబర్ 21 న బండ ప్రకాష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరగనున్న మత్స్య కార దినోత్సవం, ముదిరాజ్ మహాసభ 9వ వార్షికోత్సవంను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ముదిరాజ్ మహాసభ యువజన విభాగం నాయకుడు గుండ్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్.ఆ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు కేటీఆర్, తలసాని, మహామూద్ అలీ లు పాల్గొననున్నారన్నారు. 21 న ప్రతీ గ్రామం లో ముదిరాజ్ లు ఆత్మగౌరవ జెండా ఎగరేసి సంబరాలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ముదిరాజ్ ల సంక్షేమం కోసం కృషి చేస్తున్న రాజ్యసభ సభ్యుడు బండ ప్రకాష్ కు ధన్యవాదాలు తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా మొగిలయ్య, బిత్తిరి సత్తి, జబర్దస్త్ అవినాష్, మర్రి లక్ష్మి,కనకవ్వ, పాండు ముదిరాజ్, పిట్టల రాజారమేష్, సందీప్, హారిక, తీన్మార్ వార్తలు లోని చంద్రవ్వ లను సన్మానించబోతున్నట్లు ఆయన తెలిపారు. ముదిరాజ్ హక్కుల కొరకు పాటుపడుతున్న ముదిరాజ్ మహాసభ కు అండగా ఉండాలని ఆయన ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ముదిరాజ్ లను కోరారు. ఈ కార్యక్రమం లో గుండ్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్, ప్రొఫెసర్ దినేష్ కుమార్, అల్లుడు జగన్ ముదిరాజ్, మర్రి ప్రభాకర్, చంద్రశేఖర్, కనకయ్య, బొక్క శ్రీనివాస్, అంబర్ పేట్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగ సమస్యలు పరిష్కరించాలి



ఇబ్రహీంపట్నం నవంబర్ తేదీ 17ప్రజాపాలన ప్రతినిధి: రంగారెడ్డి జిల్లా రైతాంగ సమస్యలు పరిష్కరించాలనీ రైతు సంఘం ఇబ్రహింపట్నం మండల కార్యదర్శి చీమల మునలయ్య అన్నారు. ఇబ్రహింపట్నం మండల పరిధిలోని పోల్కంపల్లి గ్రామంలో తెలంగాణా రైతు సంఘం జెండా ఆవిష్కరణ జరిపి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు ఈ సంధ్భంగా మునలయ్య మాట్లడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపి ప్రభుత్వం రైతుల పై అధిక బరాలు మోపుతుందాని అన్నారు. దేశంలో మోటర్లకు మీటర్లు పెడుతున్నారని చెప్పారు దేశానికి వెన్నుముక అని చెప్పుకునే రైతుల ఎన్నుముక్కుకు విరగొట్టే పరిస్థితి చేస్తున్నారని ధ్వజమెత్తారు వడ్లను ఎలాంటి షరతులు లేకుండా కొనలని తెలిపారు. అనంతరం నుతన కమిటికి అధ్యక్ష, కార్యదర్శులుగా కసరమౌని జంగయ్య, మాడుగుల కరుణాకర్ రెడ్డి,ఉపాధ్యక్షులు యాదయ్య సహాయ కార్యదర్శి, కట్ట పాండు కమిటి సభ్యులుగా అమనగంటి బాలరాజు, పంది బలరాం, కె. శ్రీనివాస్,కే. ఐలయ్య తో కమిటీని ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో నాయకులు చెరుకూరి నర్సింహ్మా, గూడెం అశోక్, పంది వెంకటేశ్, ఎ.నర్సింహ్మా,పి. స్టాలిన్,నాయకులు కే.వెంకటేశ్,బాలరాజు పాల్గొన్నారు,

## లచ్చాకు నివాళులర్పించిన సైదులునాయక్..



కారేపల్లి, నవంబర్ 16 (ప్రజా పాలన న్యూస్ ):వైరా నియోజకవర్గ పరిధి లోని కారేపల్లి మండలం పోచారం గ్రామానికి చెందిన బాధావత్ లచ్చ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం ఆయన దశదినకర్మ ఆ గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ లంబాడ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షులు అధ్యక్షులు బాధావత్ సైదులు నాయక్ ఆసరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గుగులోతు మాతృనాయక్, ధరావత్ మాన్సింగ్ నాయక్, జర్పల ప్రసాద్ నాయక్, ఆంగోత్ రవి, గుగులోత్ రమేష్, జాటోత్ ప్రేమ్ కుమార్ నాయక్ ఉన్నారు.

# అధికారులరా మేల్కొనండి...

## ప్రాణ నష్టం జరగకముందే మరమ్మతులు చేపట్టండి



మధిర రూరల్ నవంబర్ 17 ప్రజా పాలన ప్రతినిధి నియోజకవర్గ పరిధిలో బోనకల్లు ఎర్రుపాలెం మధిర ఉన్న బ్రిడ్జి మీదుగా ఉన్న గుంటలను రహదారి అస్తవ్యస్తవంతో ప్రయాణికులు ప్రజలకు ఇబ్బందిగా మారిన ఆర్ఎంబి బ్రిడ్జిలుప్రమాదకరంగా మారిన బ్రిడ్జిలుఘంకుంగిన దెందుకూరు బ్రిడ్జిసైడ్ వాళ్ళు విరిగిన మీనవోలు బ్రిడ్జిగుంతల మయంగా బోనకల్ బ్రిడ్జినియోజకవర్గ పరిధిలోని ఉన్న అనేక బ్రిడ్జీలు ప్రమాదకరంగా మారాయి. ప్రాణ నష్టం జరగకముందే అధికారులు బ్రిడ్జిలకు మరమ్మత్తులు చేపట్టాలని మధిర నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. మధిర నియోజకవర్గంలో దశాబ్దాల క్రితం నిర్మించిన బ్రిడ్జి లకు అధికారులు నేటి వరకు మరమ్మతులు చేపట్టకపోవడంతో కొన్ని బ్రిడ్జిపై గుంతలు ఏర్పడగా మరికొన్ని బ్రిడ్జిల రక్షణ గోడలు విరిగి పోయాయి. ఈ బ్రిడ్జిపై వాహన చోదకులు రాకపోకలు కొనసాగిం చాలంటే ప్రాణాలను అరిచేతిలో పెట్టుకుని ప్రయాణం చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. గతంలో బ్రిడ్జిపై ఉన్న గుంతల్లో పడి మృత్యువాత గురైన సంఘటన కూడా అనేకం ఉన్నాయి. మధిర పట్టణానికి కూతవేటు దూరంలో వైరా నదిపై రాయపట్నం బ్రిడ్జి నిర్మించారు. అదేవిధంగా బోనకల్ గ్రామంలో నిర్మించిన ఆర్ఓబి మండలంలో కలకోట వద్ద వైరా నదిపై నిర్మించిన ఆర్ అండ్ బి బ్రిడ్జితో పాటు ఎర్రుపాలెం మండలం కట్టలేరు పై మీనవోలు వద్ద నిర్మించిన ఆర్ అండ్ బి బ్రిడ్జి మధిర మండలం దెందుకూరు వద్ద నిర్మించిన ఆర్ఓబి బ్రిడ్జిలు శిథిలావస్థకు చేరాయి. అనేక సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ బ్రిడ్జికి ఇప్పటివరకు ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో బ్రిడ్జిపై స్లాబ్ లేచిపోయి ఇనుప చువ్వలు బయటపడ్డాయి. రాత్రి వేళలో ప్రయాణం చేస్తున్న ద్విచక్ర వాహన చోదకులు ఇనుప చువ్వలు తగిలి ప్రమాదానికి గురైన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఈ బ్రిడ్జిపై మరమ్మతులు చేపట్టాలని అనేకసార్లు ఆర్ అండ్ బి అధికారులు దృష్టికి పట్టణ ప్రజలు, వివిధ రాజకీయ పార్టీ నేతలు తీసుకెళ్లినా అధికారుల్లో చలనం లేదు. గతంలో వివిధ రాజకీయ పార్టీ నేతలు స్వచ్ఛంద సంస్థలు ఉద్యమిస్తే మధిర ఆర్ఓబికి రాయపట్నం బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టారు. మధిర మండలంలోని దెందుకూరు ఆర్ఓబిపై కూడా భారీ స్థాయిలో గుంతలు ఏర్పడ్డాయి. ప్రజలు నడిచేందుకు ఏర్పాటుచేసిన ప్లాట్ ఫారం సైతం కృంగిపోయింది. అంతేకాకుండా బ్రిడ్జికి ఇరుపక్కలు ఏర్పాటు చేసిన రక్షణ గోడలు సైతం విరిగిపోయాయి. బ్రిడ్జిపై ఉన్న గుంతల వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందారు. దీంతో గ్రామ ప్రజలు, సర్పంచ్ వెంటనే చొరవ తీసుకుని బ్రిడ్జిపై తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఎర్రుపాలెం మండలం మీనవోలు బ్రిడ్జికి, బోనకల్ మండలం కలకోట బ్రిడ్జికి ఇరువైపుల నిర్మించిన రక్షణ గోడలు విరిగిపోయాయి. ద్విచక్ర వాహనదారులు ఆదమరిస్తే నదిలో పడిపోవడం ఖాయమని ప్రజలు చర్చించుకుంటున్నారు. బోనకల్లు రైల్వే ఓవర్ బ్రిడ్జి పై అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. బ్రిడ్జిపై ఉన్న స్లాబ్ లేచిపోవడం బ్రిడ్జి సువ్వలు బయటపడటంతో ఏ క్షణాన ఏం జరుగుతుందో అని ఆ బ్రిడ్జిపై ప్రయాణం చేసే వాహనదారులు భయంతో ప్రయాణాలను కొనసాగిస్తున్నారు. ఈ బ్రిడ్జిపై నిరంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జగ్గయ్యపేట సిమెంట్ పరిశ్రమల నుండి ఇతర ప్రాంతాలకు సిమెంట్ లారీలు భారీ స్థాయిలో రాకపోకలు కొనసాగుతాయి. అంతేకాకుండా కనీసం బ్రిడ్జికి రంగులు వేయలేదు. బ్రిడ్జిపై పారిశుధ్య అస్తవ్యస్తంగా ఉంది. ఇప్పటికైనా రోడ్ల భవనాల శాఖ అధికారులు స్పందించి మరింత ప్రాణ నష్టం జరగకముందే బ్రిడ్జిలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండలాల నియోజవర్గ ప్రజలు కోరుతున్నారు.

## గ్రామ ప్రజల శ్రేయస్సుకు కృషి చేయడం అభినందనీయం: వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



వికారాబాద్ బ్యూరో 17 నవంబర్ ప్రజాపాలన : గ్రామ ప్రజల శ్రేయస్సు కొరకు కోస్నం వేణుగోపాల్ రెడ్డి కుటుంబం కృషి చేయడం అభినందనీయమని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ కొనియాడారు. గురువారం ధారూర్ మండల పరిధిలోని తరిగోపుల గ్రామంలో గ్రామ సర్పంచ్ కోస్నం విశాల వెంకట్ రాంరెడ్డి, ధారూర్ జడ్పీటీసీ కోస్నం సుజాత, ధారూర్ మండల టిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కోస్నం వేణుగోపాల్ రెడ్డి తండ్రి కీర్తి శేషులు కోస్నం లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో 10వ వర్ధంతి సందర్భాన్ని పురస్కరించుకుని 18 సంవత్సరాలు నిండిన 250 మంది యువకులకు ఉచితంగా లిపది లక్షల ప్రమాద భీమాలి చేయిస్తున్న కార్యక్రమంలో పాల్గొన్నారు. మొదటగా కీర్తిశేషులు కోస్నం లక్ష్మారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకోసం ప్రజాప్రతినిధులుగా జడ్పీటీసీ, సర్పంచ్ లు ఇలాంటి కార్యక్రమం చేపట్టడం సంతోషకరమని, మిగతావారు కూడ ఆదర్శంగా తీసుకొని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలని సూచించారు. అనంతరం ప్రమాద బీమాకు దరఖాస్తు చేసుకున్నవారికి కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ధారూర్ మండల టిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శులు కావలి అంజయ్య ముదిరాజ్, రాజుగుప్తా, రైతు సంఘం అధ్యక్షుడు సీతగారి లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు రాములు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు యువకులు, గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వైయస్సార్ తెలంగాణ పార్టీ మండల కమిటీలు ఏర్పాటు



మధిర నవంబర్ 17 (ప్రజా పాలన ప్రతినిధి) వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ మధిర నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు నూతన అధ్యక్షులను మధిర నియోజకవర్గ కో ఆర్డినేటర్ మద్దెల ప్రసాదరావు సూచనలు ప్రకారం వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదేశాల ప్రకారం జిల్లా అధ్యక్షులు లక్కినేని సుధీర్ నియమించారు. శుక్రవారం నూతనంగా నియామకమైన మండల అధ్యక్షులకు నియామకపు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియామకమైన మండల అధ్యక్షులు వైయస్ఆర్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షులు లక్కినేని సుధీర్ నియోజకవర్గం కోఆర్డినేటర్ డాక్టర్ మద్దెల ప్రసాద రావుని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ఆర్ తెలంగాణ పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు నూతన కమిటీలు కష్టపడి పని చేయాలని వారు సూచించారు. ప్రతి గ్రామంలో గ్రామ మరియు బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలని వారు కోరారు. మండల అధ్యక్షులుగా నియామకమైన వారిలో మధిర మండల అధ్యక్షులుగా ఐలూరి ఉమామహేశ్వర రెడ్డి ఎర్రుపాలెం మండల అధ్యక్షులుగా వేమిరెడ్డి మల్లారెడ్డి బోనకల్లు మండల అధ్యక్షుడుగా షేక్ మౌలానా చింతకాని మండల అధ్యక్షుడుగా వాకా వీరారెడ్డి ముదిగొండ మండల అధ్యక్షుడుగా సామినేని రవి తదితరులు ఉన్నారు.

## మహాదేవపురం పాఠశాలను సందర్శించిన ఎంపీపీ మొండెం లలిత



మధిర రూరల్ నవంబర్ 17 ప్రజా పాలన ప్రతినిధి మండలం పరిధిలో గురువారం నాడుమహాదేవపురం ప్రాథమిక పాఠశాలను ఎంపీపీ మెండెం లలిత సందర్శించారు. పాఠశాలలో మధ్యాహ్నం భోజనం మెనూను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు ఈ సందర్భంగ్గా ఆమె మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో తెలంగాణ అభివృద్ధిని చూసి పల్లు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటూ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తే ప్రభుత్వాన్ని ఆమెట పేర్కొన్నారు అనంతరం అన్నీ తరగతులు స్కూల్లో పచ్చదనం పరిశుభ్రత ప్రగతిని పరిశీలించి విద్యార్థులను మెచ్చుకున్నారు. అదేవిధంగా ఉపాధ్యాయుల హాజరు మరియు పాఠశాల యొక్క స్థితిగతులను అడిగి తెలుసుకొని సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆమెవెంట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్,ఉపాధ్యాయులు వీరయ్య,భాస్కర్ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## కురుమల అభివృద్ధికి ప్రభుత్వాలు తోడ్పాటు అందించాలి : తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘాల జె ఎ సి



హైదరాబాద్ ( ప్రజాపాలన ప్రతినిధి ):కురుమల సంక్షేమానికి,అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందించాలి అన్నారు తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘాల జె ఎ సి నాయకులు ముత్త స్వామి. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘాల జె ఎ సి ఆధ్వర్యంలో కురుమల సంక్షేమం అన్న అంశం పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జె ఎ సి నాయకుడు ముత్త సంపత్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కురుమలు అందరూ ఐక్యంగా ఉండాలన్నారు. బీసీ లలో అధిక జనాభా ఉన్న కులమైన కురుమలకు రాజకీయ ప్రాధాన్యత లేకపోవడం శోచనీయం అన్నారు. కురుమ లు ఎవరిపై ఆధారపడరని, నిరాడంబరమైన జీవితం గడిపే కురుమలు అభివృద్ధి కి దూరంగా ఉన్నారన్నారు. గొర్రెల కాపరులుగా ఉన్న తమ సమస్యలను పట్టించుకున్న వారు లేరన్నారు. ఈ సందర్భంగా పలు జిల్లాల నుండి సమావేశంలో పాల్గొన్న కురుమ ప్రతినిధులు ప్రసంగించారు. సంఘాలు ఎన్ని ఉన్న కురుమల ఆత్మభిమానానికి, అభివృద్ధి కి చేయూత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముత్త సంపత్, కోస్గి శ్రీను, కడారి నరేంద్ర, బెళ్ళం మాధవి, శంకరొళ్ల రవి, కంచు ప్రభాకర్, దుర్గయ్య, రమణ, నర్రి స్వామి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మిక సంఘం మండల నూతన కమిటీ ఎన్నిక

### ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షులు పి అంజయ్య



ఇబ్రహీంపట్నం నవంబర్ తేదీ 17ప్రజాపాలన ప్రతినిధి: తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈరోజు తలకొండపల్లి మండల కేంద్రంలో ఉపాధి హామీ కూలీలకు సంబంధించి మండల సదస్సును ప్రజాసంఘాల నాయకులు గుమ్మడి కురుమయ్య అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఇట్టి సదస్సుకు వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పి అంజయ్య గారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వము పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పాత పద్ధతిలోనే శ్రమశక్తి సంఘాలను నిర్వహించాలని పని వద్ద సౌకర్యాలు కల్పించాలని, కూలీరేటు 600 పెంచాలని తెలిపారు. మరియు పని వద్ద కూలీలకు ఉదయము సాయంత్రము రెండు దఫాలుగా ఫోటోలు తీసే విధానాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సు అనంతరము వ్యవసాయ కార్మిక సంఘం మండల నూతన కమిటీని 16 మందితోఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా ఏ.రజిత ,కార్యదర్శిగా వి శంకర్, ఉపాధ్యక్షులుగా జంగయ్య, వెంకటేశు, రవీందర్, వెంకటయ్య,సహాయ కార్యదర్శులుగా శివ, రమాదేవి, జంగయ్య, శీను, మండల కమిటీ సభ్యులుగా శేఖర్, మమత, నవీన్, ప్రవీణ్, యాదమ్మ, వెంకటయ్య లను ఎన్నుకోవడం జరిగింది.

## నేడు పోలీసు అభ్యర్థులకు శిక్షణ శిబిరం ప్రారంభం




ఇబ్రహీంపట్నం నవంబర్ తేదీ 17 ప్రజాపాలన ప్రతినిధి: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి నియోజకవర్గ ప్రాంత యువత కోసం ఫౌండేషన్ తరపున నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగాల సాధన మహాయజ్ఞం లో భాగంగా పోలీసు ఉద్యోగాల ప్రాథమిక పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల రెండవదశ ఉచిత శిక్షణాశిబిరం శుక్రవారం ప్రారంభిస్తున్నామని, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి తెలిపారు. ఇబ్రహీంపట్నం సాగర్ రోడ్డుపైగల గురుకుల విద్యాపీఠ్ పాఠశాల గ్రౌండ్స్ లో శుక్రవారం ఉదయం 6.30 గంటలకు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఈ శారీరక శిక్షణా శిభిరాన్ని (ఫిజికల్ ట్రైనింగ్ క్యాంపు) ప్రారంభిస్తారు. అర్హులైన అభ్యర్థులందరూ తగు సమయానికి హాజరుకాగలరని తెలిపారు. సుశిక్షితులైన ఫిజికల్ డైరెక్టర్లు , వసతులు , సౌకర్యాలపై ఫౌండేషన్ సభ్యులతో ఎమ్మెల్యే సమీక్షించారు. ఈవెంట్స్ లో ఉత్తీర్ణత సాధించే అభ్యర్థులకు మూడవదశలో మెయిన్స్ పరీక్షకు శిక్షణ ఇవ్వబడును. వివరాలకు ఫౌండేషన్ కార్యదర్శి జెర్కోని రాజును సెల్ నెంబర్ (9948555125 )కు సంప్రదించగలరని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి తెలిపారు.

## బాలోత్సవంలో ఎయిడ్స్ ప్రచారం




మధిర నవంబర్ 17 ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో బుధవారం రాత్రి బాలల దినోత్సవ ముగింపు సందర్భంగా ఎయిడ్స్ ప్రచారం శ్రీరామభక్త సీతయ్య కళాపరిషత్ జాతీయ స్థాయి బాలోత్సవ్ సిల్వర్ జూబ్లీ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ సామాజిక సేవకులు మధిర ఆశామిత్ర లంకా కొండయ్య బాలోత్సవానికి వచ్చిన పిల్లల తల్లి తండ్రులకు మరియు యువతకు హెచ్ఐవి ఎయిడ్స్ గురించి సంపూర్ణంగా వివరించే కరపత్రాలను సాయంత్రం వేళ సభాప్రాంగణంలో ప్రతి ఒక్కరికి పంపిణి చేసారు. ఈ సందర్బంగా మండల విద్యాశాఖ అధికారి శ్రీ వై. ప్రభాకర్, బాలోత్సవ న్యాయ నిర్ణేత సీనియర్ కళాకారులు పాకాలపాటి రోశయ్య చౌదరి జిల్లా కాకతీయ కమ్మజన సంఘ సభ్యులు శ్రీ కళ్యాణం పుల్లారావు రామభక్త సీతయ్య కళాపరిషత్ అధ్యక్షులు, సెక్రటరీ శ్రీ పుతుంబాక శ్రీ కృష్ణ ప్రసాద్ బాబ్ల కన్వీనర్ మరోని భాయ్ సీనియర్ కళాకారులు కురిచేటి సత్యనారాయణరావు పసుపులేటి నాగేంద్ర శ్రీనివాస్ మోహన్ జంగాల గురువులు కె. బిల రావు నిర్వాహకులు దినకరన్ తదితరులు చేతుల మీదుగా కొండయ్య ఏర్పాటు చేసిన స్టాఫ్ ఎయిడ్స్ టాక్ ఎయిడ్స్ చిత్రపటాన్ని బుధవారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ గత 25 సంవత్సరాల నుండి లంకా కొండయ్య హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన పరుస్తూ హెచ్ఐవి బాధిత కుటుంబాలకు ఆదరణ కల్పిస్తూ ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయటం అభినందనీయం అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులూ ప్రజా ప్రతినిదులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి



చేవెళ్ల నియోజకవర్గం: ప్రజాపాలన :మొయినాబాద్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను వెంటనే ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు అరుణ్ కుమార్,శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు అరుణ్ కుమార్,శ్రీనివాస్.మాట్లాడుతూ మొయినాబాద్ హైదరాబాద్ కు కూతవేటు దూరంలో ఉన్న చాలా గ్రామాలు పేదరికంతో ఉన్నారని పేద విద్యార్థులు చదువుకోవడానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల లేదని దానిని వెంటనే స్థాపించాలని చాలా మంది పేద విద్యార్థులు హైదరాబాదు వెళ్లి చదువుకోలేక విద్యకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అదే విధంగా వెంటనే రాష్ట్ర ప్రభుత్వ స్పందించి మొయినాబాద్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను వెంటనే ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తున్నాం లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత




చౌటుప్పల్ నవంబర్ 17 (ప్రజా పాలన ప్రతినిధి): పాలకూర్లే శివ్వయ్యగౌడ్ స్మారక ఫౌండేషన్ ఆధ్వర్యంలో బొల్లెపల్లి గ్రామానికి చెందిన పాండాల బాలకృష్ణ ఇటీవల అకాల మరణం గురించి తెలుసుకొని నిరుపేద స్థితిలో ఉన్న కుటుంబానికి 4,000/- నాలుగువేలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది, మరియు వారి పిల్లలు, సాహతి, నీరజ్, భవిషత్తులో వారికి చదువుల కొరకు ఆర్థిక సహాయ అందజేయడం జరుగుతుందని ఫౌండేషన్ చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ని చైర్మన్ మురళి సభ్యుల ఎన్ లింగనాథ్, ఎన్ కావ్య, ఎం శిరీష, పాల్గొన్నారు,

# పేదల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసే నాయకులు ఎంపీ నామ

### నిరుపేద కుటుంబాలకు నామ ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ భరోసా



ఎర్రుపాలెం నవంబర్ 17 ప్రజా పాలన ప్రతినిధి ఎర్రిపాలెం మండలం ఎర్రుపాలెం టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం నాడు నామా ముత్తయ్య మొబైల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోఉమ్మడి ఖమ్మం జిల్లాలో వేల మంది నామ ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ నుండి ఆటో డ్రైవర్లు, హమాలీలకు ఖాకీ చొక్కాలు ఎంపీ నామ అందించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వం లో రాష్ట్రానికి రావాల్సిన విభజన హామీల కోసం కేంద్రం పై ఎంపీ నామ అలుపెరుగని పోరాటం. ఎర్రుపాలెం మండల కేంద్రంలో లి200 మంది ఆటో డ్రైవర్లకు నామ ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ నుండి ఖాకీ చొక్కాలులి పంపిణీపేదలకు ఎప్పుడు అండగా ఉంటూ వారి సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసే నాయకులు పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు రైతు బంధు సమితి జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు జిల్లా నాయకులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ , ఎంపీపీ దేవరకొండ శిరీష, సొసైటీ చైర్మన్ మూల్పూరి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు వంబి సాంబశివరావు తదితరులు పేర్కొన్నారు గురువారం నాడు మధిర నియోజకవర్గం, ఎర్రుపాలెం మండల కేంద్రంలో టీ.ఆర్.ఎస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ ఆధ్వర్యంలో నామ ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ నుండి సుమారుగా 200 మంది ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ నామ నాగేశ్వరరావు అన్ని వర్గాల వారికి ఆత్మబందువు గా ఉంటున్నారని తెలిపారు ఎంపీ గా గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుని చేస్తున్నారని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్ సహకారంతో పేదలకు సంక్షేమ ఫలాలను అందిస్తున్నారని తెలిపారు మరోవైపు తమ తల్లిదండ్రులు నామ ముత్తయ్య - వరలక్ష్మి గార్ల పేరుతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నో సేవ కార్యక్రమాలు నిర్వహించారన్నారు తమ ట్రస్ట్ నుండి ఎంతోమంది పేద విద్యార్థులకు ఆర్థిక సహకారం అందించి వారిని ఉన్నత స్థాయికి చేరేలా కృషి చేశారన్నారు పలు గ్రామాల్లో మంచి నీటి బోర్లు ఏర్పాటు తో పాటుగా హెల్త్ క్యాంపులు సహా పలు సేవా కార్యక్రమాలు చేశారని గుర్తు చేశారు ఆటో డ్రైవర్లకు, హమాలీలకు అవసరమైన ఖాకీ చొక్కాలను ప్రత్యేకంగా తయారు చేపించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇప్పటికే వేలాది మందికి అందజేయడం జరిగిందన్నారు లోక్ సభ లో పార్టీ ఫ్లోర్ లీడర్ గా ముఖ్యమంత్రి కేసీఆర్ , వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం నుండి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులు అలానే విభజన బిల్లులో ఉన్న హామీల అమలు కోసం కేంద్రం పై పార్లమెంట్ లోపల ,బయట అలుపెరుగని పోరాటం చేస్తున్నారని అలాంటి నాయకుడికి మనం అందరం కలిసి అండగా నిలవాలని కోరారు.మీనవోలు సొసైటీ చైర్మన్ కుడుములు మధుసూదన్ రెడ్డి టిఆర్ఎస్ సోషల్ మీడియా నియోజకవర్గ ఇంచార్జ్ తాళ్లూరి హరీష్ బాబు, సర్పంచ్ మోగిలి అప్పారావు , సర్పంచ్ పురుషోత్త రాజు సర్పంచ్ జంగా పుల్లారెడ్డి , సర్పంచ్ ఎర్రమల భాస్కర్ రెడ్డి , వైస్ ఎంపీపీ రామకోటయ్య , బాల రాఘవ రెడ్డి , ఎంపీటీసీ షేక్ మస్తాన్ వలి , ఎంపీటీసీ సంక్రాంతి కృష్ణారావు ఎంపీటీసీ సగ్గుర్తి కిషోర్ బాబు , యూత్ అధ్యక్షులు కొండేపాటి సాంబశివరావు ,టౌన్ పార్టీ అధ్యక్షులు చెన్నం రాము భూక్య రాము , డైరెక్టర్ ఆవులు ముత్తయ్య మండల కమిటీ సభ్యులు దేవరకొండ రవి , బోర్ర మురళీమోహన్ , ఎర్రమల కృష్ణారెడ్డి , బుర్ర నారాయణరావు వెంకటేశ్వర్లు , బీసీ సెల్ నాయకులు కత్తి నాగేశ్వరావు , నామ సేవా సమితి సభ్యులు చీకటి రాంబాబు, బోర్ర నరసింహారావు , కాశిపోయిన కాలేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి ఆలయంలో 15వ మండల పూజ వార్షికోత్సవాలు



మధిర రూరల్ నవంబర్ 12 (ప్రజా పాలన ప్రతినిధి)మధిర పట్టణంలోని లడక్ బజార్ అయ్యప్ప నగర్లో వేంచేసియున్న శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో కార్తీకమాసం లో గురువారం నాడు మండల పూజలో భాగంగా ఉదయాస్తా పూజలు శీలం వీర వెంకటరెడ్డి దంపతులు మండల పూజలో భాగంగా ఈరోజు అన్నదాత మురిసెట్టి రామచంద్ర రావు దంపతులు 23వ రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో . ఆలయంలో ప్రత్యేకంగా శివేలి ప్రదక్షణ నిర్వహించారు. అనంతరం మాలదారులకు ఏర్పాటుచేసిన అన్నదానాన్ని వారు ప్రారంభించారు. ప్రతి సంవత్సరం కార్తీకమాసం ప్రారంభం నుండి మండల పూజలు పూర్తయ్యేంతవరకు మధిర పరిసర ప్రాంత అయ్యప్ప మాలదారులకు అయ్యప్ప స్వామి ఆలయంలో దాతల సహకారంతో ప్రతిరోజు ఉచితంగా అన్నదానాన్ని నిర్వహిస్తున్నారు. అనేక సంవత్సరాలుగా అయ్యప్ప స్వామి ఆలయంలో మాలదారులకు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని దాతల సహకారంతో నిర్వహిస్తున్నారు. 63 రోజులపాటు జరిగే ఈ అన్నదాన కార్యక్రమానికి సరిపడే బియ్యాన్ని పసుర గ్రూప్ ఆఫ్ చైర్మన్ పబ్బతి వెంకట రవి వారి సోదరులు వితరణగా అందజేశారు మండల పూజల్లో. తొలి రోజు మాలదారులకు దాత ప్పోలిశెట్టి రామచంద్ర రావు దంపతులు ఏర్పాటు చేశారు. నవంబర్ 17 నుండి డిసెంబర్ 27 వరకు స్వామివారి ఆలయంలో మండల పూజలు నిర్వహించనున్నారు. అదేవిధంగా నవంబర్ 30 నుండి డిసెంబర్ 7వ తేదీ వరకు స్వామివారి ఉత్సవాలను నిర్వహించనున్నారు ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు మాట్లాడుతూ దాతలు సహకారంతో 63 రోజులు అయ్యప్ప మాలదారులకు భవానీలకు ఆంజనేయ స్వామి సుబ్రమణ్య స్వామి గోపయ్య గోవింద స్వాములు అన్నదాన కార్యక్రమం జరుగుతుందని ఈ కార్యక్రమంలో దాతలు ప్రజలు సేవా కార్యక్రమం చేసే భక్తులు వారిచే జరుపడుతుందని వారు తెలిపారు అందరూ ఆహ్వానతులే అని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చలవాదిధర్మారావు శ్రీనివాసరావు బత్తుల శ్రీనివాస్ జగన్ మోహన్ రావు శ్రీనివాసరావు పసుపులేటి నాగేంద్ర శ్రీనివాస్ అప్పారావు పుల్లారావు వంకాయలపాటి నాగేశ్వరరావు మేడ వెంకటేశ్వర్లు పలువురు భక్తులు సేవ స్వాములు పాల్గొన్నారు.

## సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆర్డీవో వెంకటచారికి వినతిపత్రం



ఇబ్రహీంపట్నం నవంబర్ తేదీ 17 ప్రజాపాలన ప్రతినిధి: అబ్దుల్లాపూర్మెట్ మండల కేంద్రంలో సర్వే నెంబర్ 283 ప్రభుత్వ భూమిలో గ్రామస్తులందరూ కలిసి గత నెల ఏడో తారీఖు గుడిసెలు వేసుకొని 37 రోజులపాటు గుడిసెల జీవనం కొనసాగించారు అట్టి గుడిసెలను ఈనెల 13వ తారీఖున రెవెన్యూ అధికారులు పోలీసు బలగాలతో గుడిసెలు తీసివేసి మహిళలు అని కూడా చూడకుండా నాటి ఛార్జ్ చేసి అరెస్టులు చేయడం జరిగింది. దీనికి నిరసనగా ఈరోజు ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయం ముందు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేసి, ఆర్డీవో కి , మేము రాండంఇవ్వడం జరిగింది, ఈ కార్యక్రమానికి సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యాదయ్య , మండల కార్యదర్శి ఏర్పుల నరసింహులు మాట్లాడుతూ గతంలో ఇందిరమ్మ ఇండ్ల కింద పట్టా సర్టిఫికెట్ ఇచ్చిన వారందరికీ, మరియు అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇవ్వకపోతే ఎన్ని కేసులు పెట్టినా గుడిసెలు వేస్తూనే ఉంటామని అన్నారు. ఆర్డీవో గారు మాట్లాడుతూ, డబల్ బెడ్ రూమ్ కాకుండా ప్రభుత్వం కూడా గతంలో పట్టాలు ఉన్నవాళ్ళకి ఇండ్ల స్థలాలు ఇచ్చే ఆలోచన ఉందని మీరు ఏమి అధైర్య పడకూడదని అని అన్నారు. ఈ కార్యక్రమంలో, సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు గుండె శివ, చిర్ర శివకుమార్, కిరణ్ ప్రణయ్, అనిత, జీవిత, రమాదేవి, మైసమ్మ, లలిత, భాగ్యలక్ష్మి, సంధ్య, పోచమ్మ, బాలమ్మ 40 రోజుల గుర్తులు వేసుకొని నష్టపోయిన మహిళలందరూ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఓపి సేవలు సక్రమంగా ప్రజలకు అందించాలి: మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు



చౌటుప్పల్, నవంబర్ 17 (ప్రజాపాలన ప్రతినిధి): చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో ప్రజలందరికీ ఓపి సేవలు అందించాలని డాక్టర్స్ ని కోరారు లాబ్, బ్లేడ్ టెస్ట్, ఫార్మసీ, ఫాస్టెడ్ కిడ్స్, వైద్యం కోసం కావాల్సిన ఎక్విప్మెంట్స్ అన్ని వైద్యం కోసం వస్తున్న వారికి అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని డాక్టర్స్ కి తెలియజేశారు,మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు ని డాక్టర్ శివప్రసాద్ శాలువా కప్పి సన్మానించారు ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ శివ ప్రసాద్, డిప్యూటీ %ఐవీఎూ% యశోద, డాక్టర్ వసంతి కుమారి, సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు..


మాస్టర్ కీ TV

అసెంబ్లీ నియోజకవర్గాల

తెలంగాణ కంటెంట్ ఓనర్స్

భారతదేశంలో ఫోర్త్ ఎస్టేట్ గా పిలవబడే మీడియా ,కొన్ని వర్గాలు, కొన్ని పార్టీల చేతిలో కీలుబొమ్మగా ఉన్న విషయం విధితమే. దీని వలన , మూడవ ఎస్టేట్స్ అయినటువంటి పార్లమెంట్, ఎగ్జిక్యూటివ్, జ్యూడిషరీ వ్యవస్థలోని తప్పిదాలు ప్రపంచానికి తెలియపరచలేకపోతుంది. మరీ ముఖ్యంగా ఈ దేశం బాగుండాలని కోరుకునే అభ్యుదయవాదులు బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, క్రిస్టియన్, ముస్లిం, మైనార్టీలు వారి సమస్యలు ప్రభుత్వాలకు తెలియకపోవడం వలన దేశాభివృద్ధిలో బహుజనులు పాలు పంచుకోలేక పోతున్నారు.

అదేవిధంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు చెప్పిన విధంగా
"పక్షికి రెక్కలు లేకపోతే ఎగురలేదు, బహుజనులకు మీడియా లేకుంటే అభివృద్ధి లేదు
అని చెప్పిన దాన్ని స్ఫూర్తిగా తీసుకుని స్నేహ గ్రూప్ ఆచరిస్తుంది.

స్నేహ గ్రూప్ ఆధ్వర్యంలో మాస్టర్ కి టీవీ ఛానల్ (అంబేద్కర్ టీవీ ఛానల్) ను ,అంబేద్కర్ స్థాపించిన మూక్ నాయక్ పత్రిక 100 సంవత్సరములు ,స్నేహ క్లబ్ 20 సంవత్సరములు సందర్భంగా కేబుల్ ఛానల్ గా ప్రారంభించడం జరిగింది.

బహుజనులు వంద కోట్ల పెట్టుబడి పెట్టి ఛానల్ పెట్టలేరు. కాబట్టి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని 294 అసెంబ్లీ నియోజకవర్గాలలో 294 వ్యక్తులను గాని / సమూహాలను గాని చానల్ ఓనరుగా నియమిస్తూ వారి పెట్టుబడికి నష్టం లేకుండా ,ఆయా నియోజకవర్గాలలో నిజమైన ఓనరుగా హక్కులను ఇస్తున్నాము .

ఈ దిగువ తెలిపిన వ్యక్తులకు /సమూహాలకు నియోజకవర్గ ఓనర్లుగా గా నియమించి హక్కును ఇవ్వడం జరిగింది.

| S.No. | Name of the Content Owner | Contact No. | Name of the Constituency |
|---|---|---|---|
| 1 | N.KOTESHWARA RAO | 9440053858 | MALKAJGIRI ASSEMBLY CONSTITUENCY |
| 2 | G.KENNY BOB | 9490804553 | GOSHAMAHAL ASSEMBLY CONSTITUENCY |
| 3 | B PRABHAKAR | 9347970131 | CHEVELLA ASSEMBLY CONSTITUENCY |
| 4 | AREPALLY RAJENDER | 9440918371 | MANUKONDA ASSEMBLY CONSTITUENCY |
| 5 | N.SATYANARAYANA | 9440956600 | MEDCHAL ASSEMBLY CONSTITUENCY |
| 6 | M.PADMA SARMA | 9440000229 | UPPAL ASSEMBLY CONSTITUENCY |
| 7 | PROF.R.SHYAM SUNDER | 9949979835 | NALAGONDA ASSEMBLY CONSTITUENCY |
| 8 | G.RAMESH | 8332974330 | KOTHAGUDAM ASSEMBLY CONSTITUENCY |
| 9 | KUSUMA BHOGARAJU | 9347350692 | SERLINGAMPALLI ASSEMBLY CONSTITUENCY |
| 10 | G.KENNY BOB | 9490804553 | KARAWAAN ASSEMBLY CONSTITUENCY |

ప్రజాపాలన
సంపాదకీయం
శుక్రవారం 18, నవంబరు 2022

## బేసికల్‌గా ఆయన మోడీ కదా !

ఐదు వందల కోట్ల భారీ బడ్జెట్‌తో తీసిన సినిమా బ్లాక్ బస్టర్ అవుతుందని అనుకుంటే అది ఫ్లాప్ అయికూచుందనుకోండి. అప్పుడు అభిమానుల పరిస్థితి, నిర్మాత, దర్శకుడు, యాక్టర్ల పరిస్థితి ఎలా ఉంటుంది? ఇప్పుడు మోడీ వచ్చి వెళ్ళాక విశాఖలో, రాష్ట్రంలో కొన్ని రాజకీయ పార్టీల పరిస్థితి ఆ విధంగానే ఉంది. మోడీ పర్యటనకి పదిహేను రోజుల ముందు నుంచీ ఒకటే సందడిగా ఉండేది కాస్తా మోడీ తిరుగు ప్రయాణం అయిన తర్వాత మాత్రం ఉన్నట్టుండి సైలెంట్‌గా కనిపిస్తోంది. పైకి కాస్తంత గంభీరంగా కనిపించడానికి వైసిపి నాయకులు తంటాలు పడుతున్నారు. "రెండు వారాలపాటు నానా హైరానా పడ్డాం. చెట్లు కొట్టించాం. దుకాణాలు లేపేశాం. జనాల్ని తోలుకు రావడానికి (వారి దృష్టిలో జనం గొర్రెలు కదా) నానా పాట్లూ పడ్డాం. లక్ష మందిని తీసుకొచ్చాం. రెండు లక్షల మంది వచ్చారని పత్రికల్లో రాయించాం. మోడీ గారిని సంతృప్తి పరచడానికి ఏమేం చేయాలో అన్నీ చేశాం. ఎక్కడా ప్రజల నిరసనలు వినపడకుండా, ఎర్ర జెండాలు కనపడకుండా ఎక్కడికక్కడ పోలీసులతో తొక్కేశాం. ఇంత చేసినా, మోడీ గారి నోటి వెంట జగన్ ప్రభుత్వం బాగా పని చేస్తోంది అని అనిపించలేకపోయాం కదా!" అని స్థానిక వైసిపి నేతలు లోలోపల బాధ పడుతున్నారు. "కనీసం మూడు రాజధానుల గురించైనా ప్రస్తావించలేదు కదా" అని వేదన పడుతున్న వాళ్ళూ లేకపోలేదు. మామూలుగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి ప్రసంగించి, ప్రధాని ముందు రాష్ట్ర ప్రజల అభ్యర్థనలను "మిక్కిలి సవినయంగా" ఉంచిన తర్వాత ప్రధాని "ఎంతో దయతో", "అత్యంత అభిమానంతో" రాష్ట్రానికి కొన్ని వరాలు ప్రకటించాలి. కాని ప్రధాని ముందే తన స్పీచ్ పూర్తి చేసేశారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి ప్రసంగించారు. "అడక్కుండానే మాకు రైల్వే స్టేషన్ ఆధునీకరణ ఇచ్చావ్. విశాఖ- రాయగఢ్ రైల్వే కారిడార్ ఇచ్చావ్, ఆరు లైన్ల రోడ్డు కూడా ఇచ్చావ్, ఇలాగే ఇంకా ఇస్తావ్. మాకు తెలుసు. అలాగే, ఆ చేత్తోటే పోలవరం నిధులు కూడ ఇస్తావని, విశాఖ ఉక్కును అమ్మకూడదన్న నిర్ణయం తీసుకుంటావని, ప్రత్యేక హోదా ఇస్తావని నేను నమ్ముతున్నాను. నువ్వు ఇస్తావ్. నాకు తెలుసు. ఎందుకంటే బేసికల్లీ యు ఆర్ మోడీ." అన్న విధంగా నువ్వు నాకు నచ్చావ్ సినిమాలో వెంకటేశ్ డైనింగ్ టేబుల్ దగ్గర ప్రార్థన చేసిన స్టైల్లో ముఖ్యమంత్రి ప్రసంగం సాగింది. జగన్ ప్రార్థనకి మోడీ ఏమీ స్పందించలేదు. ఎందుకంటే బేసికల్‌గా ఆయన మోడీ కదా. కాని వైసిపికి ఒళ్ళు దాచుకోకుండా పని చేసే కార్యకర్తలు మాత్రం "151 మంది ఎమ్మెల్యేలు, 22 మంది లోక్‌సభ ఎంపీలు ఉన్న తిరుగులేని మా పార్టీ అధినేత కేంద్రం ముందు మాత్రం ఇలాగైపోతున్నారేమిటి? అని తలలు పట్టుకుంటున్నట్టు అభిజ్ఞవర్గాల భోగట్టా. "మాది బొత్తిగా వన్ సైడ్ లవ్ లాగా ఉంది కదా. పార్లమెంటులో అన్ని సందర్భాలలోనూ మోడీకే అనుకూలంగా ఓట్లు వేస్తున్నాం. రాష్ట్రపతి ఎన్నికల్లో 100 శాతం ఓట్లు అధికార పార్టీ అభ్యర్థికి పడిన ఏకైక రాష్ట్రం మాదే. ఒక వ్రతం మాదిరిగా మా అధినేత కేంద్రాన్ని గాని, మోడీని కాని నోరు తెరిచి ఒక్క మాట కూడా విమర్శించిన సందర్భం లేదు. లోకల్ బిజెపి నేతలు మమ్మల్ని నానా రకాలుగా తిడుతున్నా...అంతర్వేది అనో, రామతీర్థం అనో, అన్య మత ప్రచారం అనో రకరకాలుగా గొడవలు రేపుతున్నా...మా అధినాయకుడు "వ్యూహాత్మక మౌనం" పాటించారే తప్ప నోరు మెదపలేదు కదా. అయినా ఇంకా మోడీజీ కి మాపై దయ కలగడం లేదెందుకని? ఏమిటి మా ప్రార్థనలో లోపం ?" ఇది అధికార పార్టీ థింక్ ట్యాంక్ అంతర్మథనం. ఇది చాలదన్నట్టు జగన్ "మాది రాజకీయాలకు అతీతమైన బంధం" అని వ్యాఖ్యానించడం కొత్త సమస్యగా మారింది. ఈ వ్యాఖ్యతో జగన్ ప్రతిపక్షాలను క్లీన్ బౌల్డ్ చేసేశారు అంటూ ఓ టివి చానెల్ (సాక్షి కాదు) అత్యుత్సాహంగా వ్యాఖ్యానించింది కూడా. ఇద్దరు రాజకీయ నాయకుల నడుమ రాజకీయాలకు అతీతమైన సంబంధం ఉండడం ఏమిటి? అని సామాన్య జనం మాత్రం విస్తుపోతున్నారు. ఆ బంధాన్ని అతికించిన ఫెవికాల్ ఏది? అది అదానీ బంధమా? లేక అంబానీ బంధమా? లేక రెండూ కలిసిన బంధమా? మరేదైనా వివాహ బంధమా? తెలుసుకోవాలని జనాలు ఉవ్విళ్ళూరుతున్నారు. మామూలుగా అధికారపార్టీ సభలకి జనాలని తరలించడానికి అధికార యంత్రాంగం అంతా కదులుతుంది. ఇందుకు కాంగ్రెస్ కాని, టిడిపి కాని అతీతం కాదు. ఐతే విశాఖ సభకి జనాల్ని తరలించిన తీరు ప్రత్యేకం. "మీరు మీటింగ్‌కి రాకపోతే పెన్షన్ ఆపేస్తాం, డ్వాక్రా నిధులు ఇవ్వం, రేషన్ కార్డు కట్ చేసేస్తాం" అంటూ వినూత్న పద్ధతిలో వలంటీర్లు, చోటా నాయకులు జనాలని ఉత్సాహపరిచినట్టు వచ్చిన జనాలే చెప్పుకున్నారు. "మీటింగ్‌కి వెళ్తే కొత్తగా ఏదో మాకు ఇస్తారని అనుకున్నాం. కాని వెళ్ళకపోతే ఉన్నవి ఊడబీకేస్తాం అని భయపెట్టడం గతంలో ఎన్నడూ చూడలేదు" అని సీనియర్ మహిళలు చాలామంది గొణుక్కున్నారు. ఇక ప్రధానితో ప్రత్యేక ఇంటర్వ్యూ సాధించిన జనసేనాని, ఇంటర్వ్యూ తర్వాత మరెక్కడా కనిపించకుండా రుషికొండ దగ్గర తేలారు. రోడ్ మ్యాప్ కోసం వెయిట్ చేస్తున్నాను అన్న ఆ హీరో మోడీతో మీటింగ్ తర్వాత ఆ ఊసు పెట్టడం లేదు. అసలు ప్రధాన ప్రతిపక్షానికైతే ఈ మొత్తం మోడీ పర్యటనే మింగుడు పడలేదు. అందుకనే ఆ పార్టీ నేత సడెన్‌గా తెలంగాణలో ఆ పార్టీని బలోపేతం చేయడం మీద దృష్టి సారించడం జరిగింది. "మోడీ వస్తాడు, అమరావతి సంగతి తేల్చేస్తాడు, ఆ దెబ్బతో జగన్ ఇరుకున పడతాడు" అని స్థానిక టిడిపి నేతలు కొందరు అత్యుత్సాహ పడ్డారు. కాని వారు ఇప్పుడు వేరే పనుల్లో బిజీ అయిపోయినట్టుంది మరి. "మా పుంజుని బరిలోకి దింపుతున్నాం. ఆ తర్వాత చూపిస్తాం మా తడాఖా" అంటూ బిజెపి కి చెందిన కొందరు నాయకులు గత రెండు నెలల నుంచీ నానా హడావుడీ చేశారు. "రాష్ట్ర రాజకీయాల రంగుల్ని, షేపుల్ని మార్చేస్తాం" అన్నారు. వాళ్ళ వంతు వాళ్ళూ జనాల్ని తోలుకొచ్చారు. ఎంతైనా స్వంత పార్టీ కదా. అందుకే మోడీ వాళ్ళతో ప్రత్యేకంగా గెస్ట్‌హౌస్ లో మీటింగ్ పెట్టారు. ఆ మీటింగ్‌లో ఏం జరిగిందో ఏమో. ఆ తర్వాత బిజెపి నేతలంతా గప్‌చుప్. ఐతే ఒకటి, రెండు ఆంగ్ల పత్రికలు మాత్రం విషయాన్ని బైటపెట్టాయి. "నా పేరు చెప్పుకుని మీరిక్కడ బలపడదామని చూస్తే కుదరదు. గుజరాత్ లో నేను ఏ విధంగా నా స్వంత పద్ధతులలో పైకొచ్చానో ఇక్కడ కూడా మీరు అదే విధంగా మీదైన స్వంత పద్ధతులలో బలపడాల్సిందే" అని మోడీ కుండ బద్దలుగొట్టినట్టు సమాచారం. "మనవాడే కదా అని మొర పెట్టుకుంటే మరి నాలుగు వడ్డించమన్నాడట వెనకటికి ఎవడో. అలా వుంది ఈ యనగారి పరిస్థితి. ఆయనగారికి గుజరాత్ లో అంబానీ, అదానీ ఉన్నారు. ఇక్కడ మనకెవరున్నారు? ఉన్న కొద్దిమందినీ ఇప్పటికే రెండు ప్రాంతీయ పార్టీలూ పంచేసుకున్నాయి. అంటూ రాష్ట్ర బిజెపి నేతలు ఆవేదనలో ఉన్నారు. "గుజరాత్ లో ఆయన అధికారంలోకి వచ్చాక కదా మత మారణ హోమం సృష్టించింది? మనల్ని ముందే రేగ్గొట్టమంటే ఎలా సాధ్యం? అని కూడా తర్జనభర్జనలు పడుతున్నారని సమాచారం. "మన విశాఖ ఉక్కుని ప్రైవేట్ పరం కాకుండా చూస్తాం అని మన దగ్గర గట్టి కబుర్లు చెప్పిన ఈ ప్రాంతీయ పార్టీల నాయకులెవరికీ కేంద్రాన్ని గట్టిగా నిలదీసే దమ్ము లేదు అన్న విషయం మాకు స్పష్టం అయిపోయింది. ఇకముందు వారి చుట్టూ తిరగడం మానేసి మా కార్మికవర్గం సత్తా ఏమిటో చూపిస్తాం" అని విశాఖ కార్మికవర్గం మాత్రం ఊపు మీద ఉంది. ఇక ఎర్రజెండా పార్టీలు ఆ కార్మికవర్గం వెంటే ఉంటాయని వేరే చెప్పాలా?

# రాజకీయ యుద్ధం, నిర్దాక్షిణ్య పర్వం!



పెద్ద ఎత్తున బలప్రదర్శన జరగలేదు కానీ, తెలంగాణలో సుదీర్ఘ, సమరశీల రాజకీయ పోరాటానికి రామగుండంలో తగినంత ఎరువు మాత్రం దొరికింది. పేరుకు రాజకీయమే అయినా, ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దర్యాప్తు సంస్థల దాడులు, అరెస్టులు, న్యాయప్రక్రియలు వగైరా అనుబంధ వినోదాలు చాలా ఉండబోతున్నాయి. ఎవరి బలగాలు వారు మోహరిస్తున్నారు. భీషణ ప్రతిజ్ఞలు వినిపిస్తున్నాయి కానీ, అవి అవక్రపరాక్రమం నుంచో అభద్రతా భావం నుంచో, తెలియడం లేదు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఒకటిన్నర రోజులో రెండు తెలుగు రాష్ట్రాలు చుట్టేశారు. మునుగోడు తరువాత, కొనుగోలు రచ్చ తరువాత వస్తున్నారు కాబట్టి, ఏదో సందేశం ఇస్తారని, ఉత్సాహం నింపుతారని తెలంగాణ బిజెపి వారు ఆశించారు. కలహభోజనం సిద్ధిస్తుందని పరిశీలకులు నిరీక్షించారు. పవన్ కళ్యాణ్ హడావుడి తరువాత, చంద్రబాబు కలసిన తరువాత వస్తున్నారు కాబట్టి, విశాఖలో ప్రధాని ఏదో మాట్లాడతారని ఆంధ్రప్రదేశ్ వారు ఎదురుచూశారు. ప్రధానికి అసలు తెలంగాణలో అడుగుపెట్టే అర్హతే లేదన్నట్టుగా టిఆర్ఎస్, కొత్తగా సత్తువ తెచ్చుకున్న కమ్యూనిస్టులు నిరసన శంఖాలు పూరించారు. రామగుండం దాకా శంఖాలు వెళ్లలేదు కానీ, ఎక్కడికక్కడ నల్లజెండాలూ నినాదాలూ కనిపించాయి, వినిపించాయి. ఆంధ్రప్రదేశ్‌కు జరుగుతున్న అన్యాయం గురించి జగన్ మాట్లాడాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. మాట్లాడలేకపోవడం ఆ ముఖ్యమంత్రి నైతిక బలహీనత. మోదీకి తెలియని తెలుగులో మాట్లాడి, మొత్తానికి ఆ లోపాన్ని అధిగమించారు. విశాఖ ఉక్కు గురించో, రైల్వే జోన్ గురించో ప్రధాని హిందీలో అయినా సరే ఓ మంచి మాట చెప్పాలని, లేదా ముఖ్యమంత్రి చెప్పించాలని వ్యక్తమయిన ఆకాంక్ష ఫలించలేదు. ముందురోజు రాత్రి పవన్ కళ్యాణ్‌తో జరిగిన భేటీలో ఏయే సందేశాలు, సూచనలు బట్వాడా అయ్యాయో తెలియదు. మొత్తం మీద ప్రధాని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మీద, జగన్ మీదా ఎటువంటి వ్యాఖ్యా చేయకుండా, యథాతథస్థితినే సూచిస్తూ వెళ్లిపోయారు. తెలంగాణలో అట్లా కాదు. వేలు పెట్టి, పేరుపెట్టి ఎవరినీ ప్రస్తావించకపోవచ్చు కానీ, ఎవరికి తగలాలో వారికి తగిలేట్టుగా మాట్లాడారు. సూర్యుడు ఉదయించగానే కమలాలు వికసిస్తాయని కవులు రాస్తారు. ఆ కవిసమయం కూడా తెలుసునో ఏమో మోదీకి, తెలంగాణలో సూర్యోదయం ఖాయమని చెప్పి పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు. దోపిడీదారులను సహించబోమని టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి హెచ్చరికలు చేశారు. అబద్ధాలు చెప్పడం కూడా సరిగ్గారాదని, కొనుగోలు కుంభకోణం గురించి కాబోలు, ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రభుత్వ అవినీతిపై యువత ఆగ్రహంగా ఉన్నారని, మునుగోడులో వ్యక్తమైన ధోరణిని మననులో పెట్టుకుని వ్యాఖ్యానించారు. నరేంద్రమోదీని మితభాషి అనడానికి లేదు. ఆయన ప్రతిరోజూ ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉంటారు. చాలా జాగ్రత్తగా రూపొందించిన వ్యక్తీకరణలతో ఆయన వివిధ ప్రజాసమూహాలను, లేదా ప్రత్యర్థి బృందాలను ఉద్దేశించి మాట్లాడతారు. ఆయన మాటకు ఒక లక్ష్యం ఉంటుంది. మౌనానికీ ఒక లక్ష్యం ఉంటుంది. దేశంలో అవాంఛనీయ పరిణామాలు అనేకం జరుగుతున్నప్పుడు, ఎంతటి ఆందోళన వ్యక్తమైనా, ఆయన పెదవి విప్పకుండా ఉన్న సందర్భాలు మనకు తెలుసు. అట్లా ఉండడం వల్ల ఎటువంటి సందేశం వెడుతుందో, ఆ సందేశం అందించడమే ఆయన మౌనానికి అర్థమని, తరువాత తరువాత కాలాల్లో ఆయన అనేక మౌనాల వల్ల మనకు తెలిసింది. ఆంధ్రప్రదేశ్‌లో అరాచక పాలన గురించిన ఆయన మౌనం కూడా అర్థవంతమైనదే అయి ఉంటుంది. 'మీరేమీ మొహమాట పడనక్కరలేదు, పోరాడవలసిన విషయాలున్నప్పుడు పోరాడండి' అని రాష్ట్ర బిజెపి నేతలకు ఆయన సూచించారని చెబుతున్నారు. కానీ, ఏపీ గురించి ఆయనకు, ఆయన పార్టీకి తక్షణ పథకాలేమీ లేనట్టు కనిపిస్తుంది. ఉండి ఉంటే, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడినే గుర్తుపట్టకుండా ఉండేవారు కాదు. కనీసం గుర్తుపట్టలేదన్న విషయాన్ని ప్రదర్శించేవారు కాదు. తెలంగాణలో పరిస్థితి వేరు. రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ ఆదేశం మేరకు తాను వచ్చానని మోదీ అన్నారు. అంటే, తెలంగాణలో ప్రాజెక్టు బలంగా ముందుకు వెడుతున్నదన్న అర్థాన్ని ఆ మాటల్లో చదువుకోవాలి. కొనుగోలు కుంభకోణం దర్యాప్తు వేగవంతం అయింది. కొత్త ఆధారాలు ప్రస్తావనకు వస్తున్నాయి. కొండను తవ్వి ఎలుకను కాకుండా కొండచిలువనే పట్టగలనని టిఆర్ఎస్ ప్రభుత్వం ఆశిస్తోంది. కేంద్రప్రభుత్వం, దాన్ని నడిపించే అధికారపార్టీ, తనను, తన మనుషులను జాతీయ ఏజెన్సీలతో ఇబ్బంది పెట్టకుండా, కెసిఆర్ వేస్తున్న ఎదురుమంత్రమే ఈ కొనుగోలు దర్యాప్తు అని జనం చెప్పుకుంటున్నారు. రాష్ట్ర దర్యాప్తు, కేంద్ర దర్యాప్తు కొట్టుడుపోయి, అన్నీ గప్ చుప్ కావాలని ఆయన ఆశిస్తున్నారని అంటున్నారు. కానీ, కేంద్రం దగ్గర నాలుగు పాచికలు ఎక్కువే ఉన్నట్టు కనిపిస్తోంది. ఢిల్లీ లిక్కర్ స్కామ్, ఒక్క దెబ్బకు రెండు పిట్టలలాగా, అటు ఆప్ ప్రభుత్వాన్ని, ఇటు టిఆర్ఎస్‌నీ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ కుంభకోణంలో కమిషన్ లాభాలు పొందేవారు కొందరు, వ్యాపార లాభం పొందేవారు మరికొందరు, గూడుపుఠాణి చేసిన వారు, వారికి డబ్బును తరలించినవారు అందరూ ఒక్కొరుగా తెరమీదకు వస్తున్నారు. దేశంలో ఇప్పుడు నడుస్తున్న వ్యవహారాలతో పోలిస్తే, చెప్పుకోదగ్గంత గొప్ప కుంభకోణమేమీ కాదు కానీ, రాజకీయంగా పనికిరాగల వ్యవహారం కావడంతో ఆయుధంగా మారింది. అవినీతి రాజకీయ వ్యవహారాలలో చార్టర్డ్ విమానాల పాత్ర గురించి కొత్తగా మాట్లాడుకునేది ఏముంది, కొనుగోలు కుంభకోణం విడియోల్లో అంతా బాహాటంగానే మాట్లాడుకున్నారు. రాత్రికి రాత్రి పనులు జరగాలంటే, లాభాలు చేసుకోవాలంటే, ప్రభుత్వాలు కూల్చాలంటే, కిరాయి విమానాలు లేకుండా సాధ్యమయ్యే రోజులేనా? కానీ, కాలం కలసిరాకపోతే, విమానవిహారాల జాబితాలే మెడకు చుట్టుకుంటాయి. లిక్కర్ స్కామ్ అయినా, ఎమ్మెల్యేల కొనుగోలు కుంభకోణం అయినా, మోదీ అన్నట్టు 'వికృత ఆలోచనాపరుల విపరీత చేష్టలు' అని అనుకోవడానికి లేదు. ఈ అన్నిరకాల దొంగ వ్యవహారాలూ జరగడానికి వీలున్నవే, రాజకీయాల్లో, ప్రభుత్వాల్లో ఉన్న పెద్దమనుషులు ఇటువంటి పాడు పనులు చేయకూడదని మడి కట్టుకున్నవారేమీ కాదు. వందల వేల కోట్లు ఎట్లా చేతులు మారతాయి, డబ్బు ఎక్కడ పార్క్ అవుతుంది, అమ్ముడుపోయినవారికి లేదా లబ్ధిదారుడికి డబ్బు ప్రయాణించడానికి గ్రీన్ కారిడార్లు ఎట్లా రూపొందుతాయి, ఇప్పుడు పెద్ద రహస్యాలేమీ కావు. ప్రాంతీయ ప్రభుత్వాలకు సన్నిహితంగా మెలిగే మహాసంపన్నులను దారికితేవడాన్ని బిజెపి తన రాజకీయ వ్యూహంలో ఒక భాగం చేసుకున్నది. అవినీతి కేంద్రంలో కానీ, తన చేతిలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలలో కానీ లేదన్నట్టు, ప్రతిపక్ష రాష్ట్రాల మీదనే, అక్కడి అధికార రాజకీయనేతల మీద, సంపన్నుల మీద ఏజెన్సీల దాడులు జరిపిస్తున్నది. రాష్ట్రప్రభుత్వాలు కూడా తమ చేతిలో ఉన్నమేరకు, సిఐడిని, ఎసిబిని, ఇంటెలిజెన్స్ విభాగాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాయి. కేంద్రం చేసే ట్యాపింగులు కొన్ని, రాష్ట్రాలు చేసే ట్యాపింగులు ఎన్నో. బిజెపి కానివారి అందరి ఫోన్లు, బిజెపి వారి ఫోన్లు కూడా కేంద్రం వింటున్నదట, గవర్నరుతో సహా అందరి ఫోన్లూ టిఆర్ఎస్ ప్రభుత్వం వింటున్నదట. నిఘాల భయంలో నీతిగా ఉంటున్నారు తప్ప, అమ్ముడుపోగూడదనే నియమం రాజకీయవాదులకు లేకపోతున్నది. ఆ నలుగురూ ఎవరి భయంలో ఉన్నారో తెలియని పరిస్థితి! సంఘ భయం మాత్రం ఖచ్చితంగా లేదు. త్వరలో కొత్త తాఖీదులు, కొత్త అరెస్టులు మొదలవుతాయి. తన కుమార్తె కవితను కూడా బిజెపిలోకి రమ్మన్నారంటూ, కెసిఆర్ సిసోడియా మంత్రం జపించారు. జాతీయ ఏజెన్సీల చర్యలకున్నంత పదును కెసిఆర్ పెట్టే గగ్గోలుకు, చేసే ప్రచారయుద్ధానికి ఉంటుందా అన్నది అనుమానమే.

లొంగదీసుకోవడమే లక్ష్యం అయితే కేంద్ర అధికారపార్టీ తీరు ఒక రకంగా ఉంటుంది. తొలగించడమే ఉద్దేశ్యం అయితే మరో రకంగా ఉంటుంది. తన ఎదురుదాడి సంధికి దారితీస్తే, తెలంగాణ అధికారపార్టీ ఒక రకంగా స్పందించవచ్చు. ఉనికికే మోసం వస్తే మరో రకంగా వ్యవహరించవచ్చు. అమీతుమీ యుద్ధం అయితే మాత్రం, అది తీవ్రంగానే ఉంటుంది. మంగళవారం నాడు కెసిఆర్ తన సకల రాజకీయ శ్రేణులకు చెప్పిన జాగ్రత్త, చేసిన హెచ్చరిక అదే. మంచిచెడ్డల సమస్యో, నీతి అవినీతుల సమస్యో కాదిది. పచ్చి వేట. ప్రస్తుతానికి తెలంగాణలో జరుగుతోంది. రేపు ఆంధ్రలోనూ జరగవచ్చు. మరెక్కడైనా జరగవచ్చు.

# కొత్త బాధ్యతలు, పాత సమస్యలు

ఇండోనేషియా నుంచి భారతదేశం జి20 సారథ్యాన్ని స్వీకరించింది. బాలిలో రెండురోజులపాటు జరిగిన ఇరవై దేశాల సదస్సులో, ఇండోనేషియా అధ్యక్షుడు జోకో విడోడో నుంచి భారత ప్రధాని నరేంద్రమోదీ ఈ కొత్త బాధ్యత అందుకున్నారు. వచ్చే ఏడాది అధ్యక్షహోదాలో సదస్సు నిర్వహణ ఏర్పాట్లతో పాటు దానికి సంబంధించిన లోగోను కూడా ఇప్పటికే ప్రభుత్వం విడుదల చేసింది. ఈ లోగోలో అధికారపక్షానికి చెందిన కమలం కూడా ఉండటంమీద విమర్శలు రేగిన విషయం తెలిసిందే. ఒకపక్క 'వసుధైవ కుటుంబకం' అంటూ, మువ్వన్నెలూ వాడుతూ, మీ పువ్వు ఏకంగా భూగోళాన్నే మోస్తున్నట్టు లోగో తయారుచేసుకోవడమేమిటన్నది విపక్షాల ప్రశ్న. శాంతికీ, జ్ఞానానికీ, ఆరోగ్యానికీ, ఆధ్యాత్మికతకూ, ఆశాభావానికీ కమలం ప్రతీక అంటూ బీజేపీ వాదించింది. ఇది కేవలం లోగో కాదనీ, మన నరనరానా ప్రవహిస్తున్న భావోద్వేగానికి, సరికొత్త సంకల్పానికీ ప్రతీక అని మోదీ చెప్పారు. కష్టకాలంలో వచ్చిపడిన ఈ కొత్త బాధ్యతలతో పుట్టుకొచ్చే సమస్యలు ఎలా ఉంటాయన్నది అటుంచితే, బాలిలో జరిగిన జి20 సదస్సునుంచి మిగతా ప్రపంచం పెద్దగా ఆశించింది ఏమీ లేదు. ఇరవై దేశాధినేతలంతా ఫోటోషూట్ కోసం ఒకచోట చేరతారనీ, ఒక కార్యాలయం, సిబ్బంది, నిర్ణయాల అమలు ఆయా దేశాల దయాదాక్షిణ్యాలమీద ఆధారపడివున్న ఈ గ్రూప్ వల్ల పెద్ద ప్రయోజనం లేదని పెదవివిరిచేవారు ఎక్కువే. పైగా, ఈ మారు ఉక్రెయిన్ యుద్ధం సదస్సును రష్యా అనుకూల వ్యతిరేకశక్తుల మధ్య నిలువునా చీల్చినందున గతంలో ఉపరితలంలో కనిపించే సుహృద్భావం కూడా ఉండదని విశ్లేషణలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో, సదస్సు ముగింపు సందర్భంగా యుద్ధానికి వ్యతిరేకంగా ఓ తీర్మానం చేయగలగడం విశేషమే. ఇది యుద్ధాల యుగం కాదనీ, యుద్ధం యావత్ ప్రపంచానికి ఆర్థిక సమస్యలనూ, అభద్రతనూ తెచ్చిపెడుతున్నదనీ, అణ్వాయుధాల వినియోగానికి సంబంధించిన హెచ్చరికలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని ఓ సంయుక్త ప్రకటన వెలువడటం మానవాళికి మంచిదే. కానీ, 'చాలా సభ్యదేశాలు' అని ఈ ప్రకటన ప్రత్యేకంగా ప్రస్తావించడాన్ని బట్టి యుద్ధాన్ని ఖండించే విషయంలో సభ్యదేశాలన్నీ ఏకమాటమీద లేవని అర్థమవుతూనే ఉంది. భారతదేశం ఈ సంయుక్త ప్రకటన రూపకల్పనలో కీలకపాత్ర పోషించిందని అంటున్నారు. సెప్టెంబరులో ఉజ్బెకిస్థాన్ లో జరిగిన షాంఘై సహకార సంఘం సదస్సులో ప్రధాని నరేంద్రమోదీ నేరుగా రష్యా అధ్యక్షుడిని ఉద్దేశించి 'ఇది యుద్ధాల యుగం కాదు' అన్నవ్యాఖ్య ఈ ప్రకటనలో చోటుచేసుకోవడం విశేషం. తమ ప్రసంగాల్లో ఎవరు ఎంత ఘాటుగా మాట్లాడినా, అంతిమంగా జాగ్రత్తగా, ఏర్చికూర్చిన మాటలతో ఈ సంయుక్త ప్రకటన తయారైన విషయం అర్థమవుతూనే ఉంది. రష్యా దూకుడు విషయంలో పాశ్చాత్యదేశాల ఆందోళనను తెలియచెప్పడంతో పాటు, మిగతా ప్రపంచం పడుతున్న ఇబ్బందుల నేపథ్యంలో, రష్యాను అష్టదిగ్బంధనం చేయడం సరికాదన్న ధ్వని కూడా ఈ ప్రకటనలో ఉన్నది. రష్యాకు కొన్ని మినహాయింపులు ఇవ్వాలనడం ద్వారా కొంత సానుకూల వాతావరణాన్ని సృష్టించి, భవిష్యత్తులో చర్చలకు దారులు పరిచారని కూడా అంటున్నారు. కీలకమైన తైవాన్ విషయంలో ముందడుగు పడకపోయినా, అమెరికా, చైనా అధ్యక్షుల మధ్య తొలిరోజునే జరిగిన సమావేశం వైరాన్ని కాస్తంత చల్లార్చేందుకు ఉపకరిస్తుంది. లద్దాఖ్ లో చైనా దురాక్రమణ తరువాత, ఉభయదేశాల మధ్యా వేడిపుంజుకున్న నేపథ్యంలో తొలిసారిగా చైనా అధ్యక్షుడితో మోదీ కరచాలనం చేయడం, నవ్వుతూ నాలుగుమాటలు చెప్పడం ప్రపంచమంతా ఆసక్తిగా గమనించింది. బ్రిటన్ కొత్త ప్రధాని రిషీ సునాక్ ను మోదీ కలుసుకోవడం ఇదే ప్రథమం. అమెరికా అధ్యక్షుడితోనూ కరచాలనాలు, అప్యాయతతో కూడిన ఆలింగనాలు చూడముచ్చటగా ఉన్నాయి. జీ20 బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా, భారతదేశం గ్లోబల్ స్థాయిలో విశేషమైన మార్పులకు ఒక వాహకంగా పనిచేస్తుందని నరేంద్రమోదీ హామీ ఇచ్చారు. మీ మధ్యనే ఓ ఉగ్రవాది ఉన్నాడు అంటూ రష్యాను ఉద్దేశించి ఉక్రెయిన్ అధ్యక్షుడు దులిపేసిన ఈ గ్రూప్ కు ఏడాదిపాటు సారథ్యం వహిస్తున్న భారత్ మీద యుద్ధాన్ని అంతం చేసే విషయంలో మిగతా ప్రపంచానికి కొన్ని ఆశలున్నాయి. మోదీ ప్రసంగంలోనూ ఇది పరోక్షంగా ధ్వనించింది.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు సహాయ ప్రభుత్వం
కోరుట్ల శాసనసభ్యులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు




కోరుట్ల, నవంబర్ 17 (ప్రజాపాలన ప్రతినిధి):జగిత్యాల జిల్లా పోలాస వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కిసాన్ మేళా 2022 కార్యక్రమానికి జగిత్యాల శాసనసభ్యులు సంజయ్ మరియు జెడ్పి చైర్మన్ దావ వసంత తో కలిసి ముఖ్య అతిథిగా కోరుట్ల శాసనసభ్యులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు హాజరైనారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల శాసనసభ్యులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు మాట్లాడుతు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయాన రైతు అని, తెలంగాణ ప్రభుత్వం మన దేశంలోనే రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసే ప్రభుత్వమని, తెలంగాణలో ప్రవేశపెట్టిన రైతు బంధు రైతు భీమ పథకాలు దేశానికే ఆదర్శని కొనియాడారు.దేశంలోని అన్ని రాష్ట్రాల రైతులు తెలంగాణ వైపు చూస్తున్నారని కేసిఆర్ రైతు పాలిట దేవుడని తెలిపారు.

## తల్లాడ పట్టణానికి నూతన శోభ..




తల్లాడ, నవంబర్ 16 (ప్రజాపాలన న్యూస్): రాజ్యసభ సభ్యులు బండి పార్థసారథి రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర నేడు సత్తుపల్లి నియోజకవర్గ పర్యటనకు రానున్నారు. అందులో భాగంగా తల్లాడలో కూడా భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీ నాయకులు తల్లాడ పట్టణాన్ని ముస్తాబు చేశారు. భారీగా ప్లెక్షీలు, రింగ్ రోడ్డు చుట్టూ టిఆర్ఎస్ గులాబీరంగు తోరణాలు, బెలూన్లు కట్టారు. సత్తుపల్లి శాసనసభ్యులు సండ్రా వెంకట వీరయ్య రాజ్యసభ సభ్యులకు స్వాగతం పలుకుతున్నట్లుగా తోరణాలు ఏర్పాటు చేశారు. దీంతో తల్లాడ పట్టడం గులాబీ మయంతో కళకళ లాడుతోంది.

## రాయపోల్ గ్రామఅభివృద్ధికి 35 లక్షల నిధులు మంజూరు



ఇబ్రహీంపట్నం నవంబర్ తేదీ 17ప్రజాపాలన ప్రతినిధి: ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి సహకారంతో ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామాభివృద్ధికి 35 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయడం జరిగిందని ఆ గ్రామ సర్పంచ్ గంగిరెడ్డి బలవంత్ రెడ్డి అన్నారు.కుమ్మరి సంఘానికి 8 లక్షలు, ముదిరాజ్ సంఘానికి 6 లక్షలు,రజక సంఘానికి 6 లక్షలు, బిల్డింగ్ కు 15 లక్షల రూపాయల ప్రొసీడింగ్స్ ను ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి చేతుల మీదుగా గురువారం గ్రామ ప్రజాప్రతినిధులు, కుల సంఘాల పెద్దలు తీసుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగిరెడ్డి బల్వంత్ రెడ్డి, ఎంపీటీసీ1శ్రీశైలం, ఎంపీటీసీ2 గంగిరెడ్డి జ్యోతి భాస్కర్ రెడ్డి, ఉప సర్పంచ్ బాలరాజు, టిఆర్ఎస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు బుగ్గరాములు, పిఎసిఎస్ వైస్ చైర్మన్ ఈశ్వర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు బాలు గౌడ్, వార్డ్ మెంబర్లు,కో ఆప్షన్ నెంబర్లు, గ్రామ ముదిరాజ్ సంఘం పెద్దలు, కుమ్మరి సంఘం పెద్దలు, రజక సంఘం పెద్దలు, గ్రామ టీఆర్ఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన జువ్వాడి



కోరుట్ల, నవంబర్ 17 (ప్రజాపాలన ప్రతినిధి): కోరుట్ల మండలంలోని పైడిమడుగు గ్రామంలో ఇటీవల కాలంలో మరణించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నేమిళ్ల మల్లారెడ్డి రమేష్ తండ్రి, కట్కాకం రాజు వాళ్ళ కూతురు ఇటీవల కాలంలో మరణించగా గురువారం రోజున వారి కుటుంబ సభ్యులను టీపీసీసీ నేత జువ్వాడి కృష్ణ రావు పరామర్శించారు.అనంతరం జోగన్ పల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ పల్లికొండ నరేష్ తల్లి బుధవారం రోజున అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను టీపీసీసీ నేత జువ్వాడి కృష్ణ రావు పరామర్శించారు.వారి వెంట పైడిమడుగు గ్రామ సర్పంచ్ ధమ్మ బీమారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు జనార్దన్, యువజన కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ అధ్యక్షుడు ఏలేటి మహిపాల్ రెడ్డి, కోరుట్ల మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సైదు గంగాధర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎర్దండి మోహన్ రెడ్డి, స్వామి రెడ్డి, తెలు శ్రీను, రాంమోహన్ తదితరులు ఉన్నారు.

# ఆర్థిక అభివృద్ధికి ఆహార శుద్ధి పరిశ్రమలు

## వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ




వికారాబాద్ బ్యూరో 17 నవంబర్ ప్రజా పాలన : ఆహార శుద్ధి పరిశ్రమలు నెలకొల్పుకొని ఆర్థికంగా ఎదగాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. గురువారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్, సెర్ప్, డి ఆర్ డి ఓ ఆధ్వర్యంలో పిఎంఎఫ్ఎం ఇ పథకం( ప్రైమ్ మినిస్టర్ ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజెస్ ) పై అవగాహన, రుణాలు అందించే కార్యక్రమం పై జిల్లా మహిళా సమాఖ్య సభ్యులచే సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. మహిళలు తమకు నచ్చిన రంగాల్లో కుటీర పరిశ్రమలను స్థాపించుకొని ఆర్థికంగా ఎదిగేందుకు పథకం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. జిల్లాలోని మహిళా సమైఖ్యలకు పెద్ద మొత్తంలో రుణాలు అందించడానికి ముందుకు వచ్చిన హెచ్ డి ఎఫ్ సి బ్యాంకు ఉన్నత అధికారులను ఆయన అభినందించారు. ఇప్పటికే జిల్లాలోని 19 మండలాల్లో 274 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి సబ్సిడీతో కూడిన రుణాలను అందజేయడం జరుగుతుందని ఆయన అన్నారు. లబ్ధిదారులు బ్యాంకుల చుట్టూ తిరగకుండా అధికారులే లబ్ధిదారుల చెంతకు వెళ్లి బ్యాంకు ప్రక్రియను పూర్తి చేయడం మంచి పరిణామం ఆయన అన్నారు. బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలను ఎప్పటికప్పుడు చెల్లించాలని ఆయన సూచించారు. హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ సౌత్, మహారాష్ట్ర జోనల్ బిజినెస్ హెడ్ అమిత్ లఖన్ పాల్ మాట్లాడుతూ.. ఇండియా మొత్తంలో 6,500 బ్రాంచ్ లు పనిచేస్తున్నాయని అయినప్పటికీ వికారాబాద్ జిల్లాలో పిఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా అందించడం అదృష్టంగా భావిస్తున్నామని ఆయన అన్నారు. వ్యక్తిగతంగా, సమూహంగానైనా రుణాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమం ముందుగా పిఎంఎఫ్ఎంఈ పథకం యొక్క ఉద్దేశాలు, రుణం పొందే విధానం పై తెలంగాణ ఇంచార్జ్ ప్రభంజన్ లబ్ధిదారులకు, మహిళా సమాఖ్య సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ కృష్ణన్, హెచ్ డి ఎఫ్ సి బ్యాంకు ఉన్నతాధికారులు సుబ్రవేణి భాగవతి, బేరే రామకృష్ణ, సోహెల్ పర్వాజ్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అలవేలు, ఏపీవోలు, సీసీలు తదితరులు పాల్గొన్నారు. సమావేశానంతరం అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ , డిఆర్ డిఓ కృష్ణన్ , బ్యాంకు అధికారులు రుణ మంజూరి పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల ఎంపికలో కృషి చేసిన ఏపీవోలు, సిబ్బందిని సన్మానించారు.

## రాజీవ్ కాంప్లెక్స్ ను కాపాడాలని కాంగ్రెస్ర నిరసన దీక్ష




బెల్లంపల్లి , నవంబర్ 17, ప్రజా పాలన ప్రతినిధి: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని ప్రధాన రహదారిలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముందు నిర్మించిన రాజీవ్ కాంప్లెక్స్ దుకాణాల సముదాయం తమదంటే, తమదని, వాటిని కాపాడు కోవడానికి ఆ దుకాణ సముదాయంలో ని వ్యాపారులు చేస్తున్న నిరసనకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సహితం నిరసన దీక్ష చేపట్టడం బెల్లంపల్లిలో చర్చనీయాంసమైంది.గత 30 సంవత్సరాల క్రితం మున్సిపల్ అధికారులు రోడ్డు వెడల్పు చేసే క్రమంలో , రోడ్డు వెంబడి ఉన్న చిన్న చిన్న టేలాలు, రేకుల షెడ్లలో ఉండే వ్యాపారస్తుల దుకాణాలు రోడ్డు వెడల్పు లో పోగా, కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన స్థలమ్, ప్రధాన రహదారికి రావడంతో, దుకాణాలు కోల్పోయిన వ్యాపారులు కాంగ్రెస్ పార్టీ కార్యాలయా స్థలంలో తొమ్మిది వ్యాపార సముదాయాలను నిర్మించి అద్దెకిస్తున్నామని కాంగ్రెస్ నాయకులు అంటుండగా, దుకాణాలు కోల్పోయిన వారు ఆ స్థలం కూడా తమదేనని రూములు కూడా మేమే నిర్మించుకున్నామని అవన్నీ మా పేరున్నే మున్సిపల్ కార్యాలయంలో ఇంటి పన్నులు, కరెంట్ బిల్లులు మా పేరు తోనే చెల్లిస్తున్నా మని, వ్యాపారులు అంటున్నారు.తమయే దుకాణాలంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు దుకాణ యాజమానులను బయటకు పంపించి తాళాలు వేయగా, రెండవ రోజు దుకాణాల యజమానులు తాళాలు పగులగొట్టి వీరు తాళాలు వేయగా గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏకమై దుకాణా సముదాయాలకు ఉన్న పేర్లను తుడిచివేసి, షెటర్లకు తాళాలు వేయకుండా డైరెక్ట్ వెల్డింగ్ మిషన్లతో వెల్డింగ్ లు చేయించి వ్యాపారస్తులకు వ్యతిరేకంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు నిరసన దీక్షకు కూర్చున్నారు. ఏది ఏమైనా చిలికి చిలికి గాలి వానగా మారిన రాజీవ్ కాంప్లెక్స్ వివాదం అటు కాంగ్రెస్ పార్టీ నాయకులకు దుకాణాలలో వ్యాపారాలు చేసుకునే వ్యాపారస్తులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకునే స్థాయికి చేరుకున్నాయి, ఈ వివాదం స్థానిక పోలీసులకు తలనొప్పిగా మారింది.

## సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం



ప్రజా పాలన :షాబాద్ మండల్ సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ మంత్రివర్యులు పట్నం మహేందర్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య జడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డి విచ్చేసి నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులని ప్రమాణ స్వీకారం చేయించడం జరిగిందిలి లిఈ సందర్భంగా మాజీ మంత్రివర్యులు పట్నం మహేందర్ రెడ్డి ఎమ్మెల్యే కాలే యాదయ్య జెడ్పిటిసి అవినాష్ రెడ్డి మాట్లాడుతూ 30 సంవత్సరాల పాటు పార్టీలో కొనసాగుతూ పార్టీ కోసం ఎంతో శ్రమించి పదవులు కాదు పార్టీ కోసం శ్రమించడమే ముఖ్యమని నమ్మిన వ్యక్తి నర్సింగ్ రావు పార్టీ మండల అధ్యక్షునిగా పనిచేసి అందరి మెప్పు పొంది మా కుటుంబ సభ్యుల్లో ఒకరిగా ఉంటూ ఇప్పుడు మార్కెట్ కమిటీ చైర్మన్గా ఎన్నికైనందుకు సంతోషంగా ఉంది అదేవిధంగా వైస్ చైర్మన్ గా అబ్దుల్ రావుఫ్ ఇతర పాలక వర్గ సభ్యులుగా ఎన్నిక కావడం ఎంతో సంతోషకరం అదేవిధంగా పాలకవర్గ సభ్యులు మార్కెట్లో రైతులను ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూసుకోవాలని అన్నారులి లిఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగరావు వైస్ చైర్మన్ అబ్దుల్ రావుఫ్ మాట్లాడుతూ మాజీ మంత్రివర్యులు మహేందర్ రెడ్డి ఎమ్మెల్యే కాలే యాదయ్య జెడ్పిటిసి అవినాష్ రెడ్డి షాబాద్ మొయినాబాద్ రెండు మండలాల టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు సర్పంచులు అందరికీ మ యొక్క కృతజ్ఞతలు మా మీద విశ్వాసంతో నమ్మకంతో ఈ పదవులు కట్టబెట్టినందుకు అందరికీ రుణపడి ఉంటామని అన్నారు. లిఅనంతరం పాలకవర్గా సభ్యులకు శాలువాలు పూలమాలతో సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో షాబాద్ మొయినాబాద్ రెండు మండలాల ఎంపీపీలు వైస్ ఎంపీపీలు సర్పంచులు మాజీ సర్పంచులు ఎంపిటిసిలు ఎంపీడీవోలు పిఎసిఎస్ చైర్మన్లు డైరెక్టర్లు టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు నూతన కార్యవర్గ సభ్యులు వివిధ గ్రామాల ప్రజలు మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించాలి



ఇబ్రహీంపట్నం నవంబర్ తేదీ 17ప్రజాపాలన ప్రతినిధి: ఇబ్రహంపట్నం మండల పరదిలోని పొల్కంపల్లి గ్రామంలో పేరుకుపోయిన ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి రాధకి వినతిపత్రం అందజేసిన సిపిఎం నాయకులు ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకులు చెరుకూరి నరసింహ మాట్లడుతూ గ్రామం సమస్యల వలయంగా మారిందన్నారు గ్రామంలో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని అన్నారు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన మిషన్ భగీరథ త్రాగు నీరు పేరుకు మాత్రమే ఉన్నాయి తప్ప నీరు వచ్చిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు గ్రామంలో కొత్తగా ఇండ్లు నిర్మించే వారు రోడ్ల ఆక్రమించి నిర్మానం చేస్తున్నరు అక్రమ నిరమాణాల పైన చర్యలు తీసుకోవాలని అన్నరు గ్రామ పంచాయతీ స్థలాలను గ్రమా పంచాయతి అధీనంలో ఉంచుకోవాలని అన్నారు ఈ సమస్యలు పరిష్కరించానీ ఎడల ప్రజలందరితో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరంచారు ఈ కార్యక్రమంలో సీపీఎగ్రామ శాఖా కార్యదర్శులు గూడెం అశోక్,పి.స్వామి, మాజీ వార్డు సభ్యులు చెరుకూరి యాదయ్య, రైతు సంఘం గ్రామ కార్యదర్శి మాడుగుల కరుణాకర్ రెడ్డి, అమనగంటి బాలరాజు, కంబాలపల్లి బాలరాజు తదితరులు పాల్గొన్నారు,

## టీఎస్ యుటిఎఫ్ జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



బోనకల్ ,నవంబర్ 17 ప్రజాపాలన ప్రతినిధి: ఈనెల 20వ తేదీన వైరా పట్టణంలో జరిగే టీఎస్ యుటిఎఫ్ 5వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ టీఎస్ యుటిఎఫ్ బోనకల్ మండల శాఖ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గుగులోతు రామకృష్ణ , మండల అధ్యక్షులు బి.ప్రీతం మాట్లాడుతూ ఈ మహాసభలకు గౌరవ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలియజేశారు. మహాసభలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం అవలంబించవలసిన పోరాటాలకు సంబంధించి అనేక తీర్మానాలు చేయడం జరుగుతుందని. అదేవిధంగా ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు అనేక తీర్మానాలు ప్రవేశపెట్టినట్టు తెలిపారు. ఈ మహాసభలు అత్యధిక మంది ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా ఉపాధ్యాయ లోకానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షులు బి. ప్రీతం ఉపాధ్యక్షులు చంద్రప్రసాద్, సధాబాబు, కే శ్రీనివాసరావు, రాఘవాచార్యులు, టి.లక్ష్మి,,జి నిర్మల, పద్మలత, జ్ఞానేశ్వర్ చారి, శ్రీలక్ష్మి,వెంకటలక్ష్మి, రామకృష్ణమ్మ, నరసింహారావు, గోపాల్ రావు, చిన్న రంగారావు తదితరులుపాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో పడిపూజ



ఇబ్రహీంపట్నం నవంబర్ తేదీ 17ప్రజాపాలన ప్రతినిధి: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ పరిధిలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానము వద్ద గురువారం రోజున అయ్యప్ప స్వామి మహాపడి పూజ నిర్వహించడం జరిగింది. చెరుకూరి మహేందర్ తన కుమార్తె మొదటి పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దండెం రామిరెడ్డి, తెలుగుదేశం నాయకులు జెలమోని రవీందర్, బిజెపి నాయకులు కాళిదాసు, మాజీ రెవిన్యూ ఉద్యోగి జైన్ శ్రీ రాంరెడ్డి, ఇబ్రహీంపట్నం జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షులు సూరమోని సత్యనారాయణ, యాంపల్ల సుధాకర్ రెడ్డి, జెర్కొని రాజు, కన్నె అరవింద్, భోగవరపు రమేష్ గుప్తా జర్నలిస్ట్ లు, అయ్యప్ప స్వాములు భక్తులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చిన్నారులను ఆశీర్వదించిన మట్టా దయానంద్..



తల్లాడ, నవంబర్ 16 (ప్రజాపాలన న్యూస్): తల్లాడ మండలంలోని అన్నారు గూడెం గ్రామంలో తెల్లబోయిన నారాయణ, నాయనమ్మ బ్రహ్మమ్మ మనవరాల్లు సాగరిక, లక్ష్మి ప్రసన్న ఓణిలా అలంకరణ వేడుకలో టిఆర్ఎస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇమ్మనేని ప్రసాద్ రావు, దొడ్డా శ్రీనివాస్ రావు, తుమ్మలపల్లి రమేష్, గ్రామ శాఖ అధ్యక్షులు పొన్నెం కృష్ణయ్య, తాళ్ళ జోసెఫ్, నున్నా సందీపులు, వలరాజు, వెంకటయ్య, షేక్ యాకుబ్ పాషా పాల్గొన్నారు.

## డాక్టరేట్ తీసుకున్న 'పదిరావు'శ్రీనివాస చారిని ఘనంగా సన్మానించిన అశ్వాపురం సిపిఐ పార్టీ నాయకులు




అశ్వాపురం (ప్రజా పాలన.):అశ్వాపురం మండలం మొండికుంట నివాసి అయిన పది రావూరి శ్రీనివాసచారి ఇటీవల తను నమ్ముకున్న వాస్తు రంగంలో అంచలంచెలుగా ఎదుగుతూ అమెరికన్ యూనివర్సిటీ నుండి థాయిలాండ్ దేశంలో అక్కడి గవర్నర్ చేతుల మీదుగా డాక్టర్ తీసుకున్న సందర్భంగా అశ్వాపురం సిపిఐ జిల్లా పార్టీ నాయకులు కమటం వెంకటేశ్వరావు సారథ్యంలో అశ్వాపురం సిపిఐ పార్టీ మండల కార్యదర్శి అనంత నేని సురేష్ అధ్యక్షతన ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శివేల్పుల మల్లికార్జున్ మరియు సిపిఐ పార్టీ కార్యవర్గ సభ్యులు మెలపురా సురేందర్ రెడ్డి రాయపూడి రాజేష్ పవన్ సాయి వెంకటనర్సయ్యనాయకులు ముత్తబోయిన వెంకటేశ్వర్లు శ్రీనివాస చారిని ఘనంగా సన్మానించి డాక్టరేట్ తీసుకున్నందుకు అభినందనలు తెలియజేశారు .

## దివ్యాంగుల సాధికారత అవార్డు కొరకు దరఖాస్తుల స్వీకరణ: జిల్లా సంక్షేమాధికారి కె. చిన్నయ్య



మంచిర్యాల బ్యూరో, నవంబర్ 17, ప్రజాపాలన :అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా అందించే రాష్ట్రీయ దివ్యాంగుల సాధికారత అవార్డు ప్రధానోత్సవంలో భాగంగా ఈ సంవత్సరం ఆసక్తి గల దివ్యాంగులు, దివ్యాంగుల కొరకు పని చేస్తున్న సంస్థల నుండి ఈ నెల 23వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా మహిళా, పిల్లల, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారి కె. చిన్నయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21, 22 తేదీలలో ఉదయం 8 గం॥ల నుండి 10 సం?ల నుండి 54 సం॥ల వయస్సు గల వారికి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా స్థాయిలో వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతుందని, ఆసక్తి గల వారు జిల్లా సంక్షేమాధికారి కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు. ఉత్తమ ఉద్యోగి, ఉత్తమ స్వయం ఉద్యోగి, ఉత్తమ వ్యక్తిగత సామాజిక కార్యకర్త, రోల్ మోడల్, ఉత్తమ క్రీడా వ్యక్తి, సంస్థ, ఉత్తమ యజమానులుగా అవార్డు కొరకు ఆన్లైన్లో వెబ్సైట్ ద్వారా ఈ నెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## 4 లైన్ల రోడ్డు విస్తరణ నిర్మాణ పనులను పరిశీలించిన మేయర్ జక్క వెంకట్ రెడ్డి



మేడిపల్లి, నవంబర్ 17 (ప్రజాపాలన ప్రతినిధి):పీర్జాదిగూడ కమాన్ నుండి పర్వతాపూర్ వరకు సుమారు రూ ?26.32 కోట్లతో నిర్మితమవుతున్న 4 లైన్ల రోడ్డు విస్తరణ నిర్మాణ పనులను మేయర్ జక్క వెంకట్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. అలాగే విస్తరణలో ఇండ్లు,షాప్ లు కోల్పోతున్నవారి వద్దకు స్వయంగా వెళ్లి రోడ్డు విస్తరణకు సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. రోడ్డు విస్తరణలో ఇండ్లు, స్థలం కోల్పోయిన వారికి ప్రభుత్వం టిడిఆర్ బాండ్స్ రూపంలో నష్టపరిహారం చెల్లించడంతో పాటు సర్వం కోల్పోయిన వారిని అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. రోడ్డు విస్తరణకు సహకరిస్తున్న ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పని చేసి అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం తెలియజేయాల్సిందిగా పేర్కొన్నారు. విద్యుత్, స్తంబాలు,ట్రాన్సుఫార్మర్లు ఎన్ని రోడ్లకు అడ్డంగా వస్తున్నాయో పూర్తి వివరాలు సేకరించి ఎక్కడైతే స్తంబాలు, ట్రాన్సుఫార్మర్లను షిఫ్ట్ చేయాల్సి ఉందో వెంటనే షిఫ్ట్ చేయాలని, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఎత్తు ఎక్కువగా ఉండే విద్యుత్ స్తంబాలు,బంచ్ కేబుల్స్ వేయాలని ఆయన ఆదేశించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం దృష్టి సారించిందని, సమస్యల పరిష్కరంలో నిర్లక్ష్యం చేయొద్దని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కౌడే పోచయ్య, అలవాల సరితా దేవేందర్ గౌడ్, నాయకులు మాడుగుల చంద్రారెడ్డి, అలవాల దేవేందర్ గౌడ్, టిపిశఎస్ రాజీవ్ రెడ్డి,విద్యుత్ అధికారులు,రెవిన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 2 లక్షల రూపాయల ప్రమాద బీమా చెక్కును అందించిన ఏపీజీవీబీ బ్యాంకు వారు



బూర్గంపాడు (ప్రజా పాలన.)బూర్గంపాడు మండలం సారపాక ఏపీజీవీబీ బ్యాంకులో స్వప్న వివో రాణి రుద్రమ్మ గ్రూపులో ముదిగొండ మాణిక్యం అనే సభ్యురాలు 420 రూపాయలు ప్రమాద బీమా ఇన్సూరెన్స్ చేసుకోవడం జరిగినది . అయితే ప్రమాదవశాత్తు ఆమె మరణించడం వల్ల రెండు లక్షల రూపాయల ఏపీజీవీబీ బీమా చెక్కును బూర్గంపాడు మండలం సారపాక గ్రామీణ వికాస బ్యాంకు మేనేజర్ మరియు బ్యాంకు సిబ్బంది స్వప్న వివో అరుణ, బుక్ కీపర్ నాగమణి , చేతుల మీదగా వారి కుటుంబ సభ్యులకు అందించడం జరిగింది. కాబట్టి ప్రతి ఒక్కరు కూడా ప్రమాద బీమాను తప్పనిసరిగా చేయించుకుంటే అది ఏదో ఒక రూపంలో మనకు ఉపయోగపడుతుందని బ్యాంకు మేనేజ్మెంట్ తెలియజేయడం జరిగినది.

## భూర్గంపహాడ్ మండలం బి. ఆర్. స్ పార్టీ ఎస్సి సెల్ కార్యవర్గ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న పినపాక నియోజకవర్గం ఎస్సి సెల్ బి. ఆర్. స్ పార్టీ అధ్యక్షులు వెన్న అశోక్ కుమార్



బూర్గంపాడు (ప్రజా పాలన.) భూర్గంపహాడ్ మండలం బి. ఆర్. స్ పార్టీ ఎస్సి సెల్ అధ్యక్షులు వలదాసు నాలయ్య అధ్యక్షతన..!ఈ రోజు బూర్గంపాడు మండలం బి.అర్.యస్ పార్టీ కార్యలయంలో ఏర్పాటు చేసిన బూర్గంపాడు మండల ఎస్సి సెల్ కార్య వర్గ సమావేశంలో ముఖ్య అతిధిలుగా పినపాక నియోజకవర్గం బి. ఆర్. స్ పార్టీ ఎస్సి సెల్ అధ్యక్షులు వెన్న అశోక్ కుమార్ భూర్గంపహాడ్ మండలం బి. ఆర్. స్ పార్టీ అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి %ఎ% పినపాక నియోజకవర్గం బి. ఆర్. స్ పార్టీ పరిశీలుకులు తడికమళ్ళ ప్రభుదాస్ పాల్గొన్నారు. .అదేవిధంగా పినపాక నియోజక వర్గం ఎస్సి సెల్ అధ్యక్షులు వెన్న అశోక్ కుమార్ మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నది అనీ అన్నారు , దళిత బంధు పథకం మీద వస్తున్న వార్తలను నమ్మవద్దు అనీ, ఈ పథకం 7సంవత్సరాల ప్రోగ్రామ్ అని దళిత కుటుంబాలు అందరికి ఈ పథకం అందుతుందని అన్నారు, పినపాక నియోజకవర్గం శాసన సభ్యులు గౌ :శ్రీ రేగా కాంతారావు నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి పనుల గురించి గ్రామాలలో ప్రజలకు తెలియజేసే బాధ్యత కమిటీ వారిదే అని అన్నారు. ఈ సమావేశంలో మండల బి ఆర్ఎస్ పార్టీ ఎస్సి సెల్ ప్రధాన కార్యదర్శి దాసరి కాంతారావు , మాజి జెడ్పీటీసీ భూపల్లి నరసింహ రావు, భూర్గంపహాడ్ మండలం సోషల్ మీడియా అధ్యక్షులు గంగపురి చంద్రశేఖర్,అశ్వాపురం మండలం బి. ఆర్. స్ పార్టీ ఎస్సి ప్రధానకార్యదర్శి వల్లెపోగు రాము, శంకర్ మరియు భూర్గంపహాడ్ మండల ఎస్సి సెల్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు

| | | | | |
|---|---|---|---|---|
| నరోత్తమ్‌రెడ్డి | – | మేడిపల్లి | – | 9346970159 |
| వెంకటస్వామి | – | మంచిర్యాల | – | 9515048103 |
| ఎం. గైబులు | – | వికారాబాద్ | – | 9704570475 |
| టి.రాంబాబు | – | శేర్లింగంపల్లి | – | 6301925113 |
| సత్య కిషోర్ | – | అమీర్‌పేట | – | 6309723472 |
| బోడ మనోహర్ నంద | – | కరీంనగర్ | – | 9492927684 |
| రాజేందర్ ప్రసాద్ | – | ఖమ్మం | – | 7013953536 |
| పి.ఎన్.శ్రీనివాస్ | – | మధిర | – | 9030821362 |
| గంజిగుంట్ల వెంకన్న | – | పాలేరు | – | 9848895405 |
| పసుపులేటి ఈశ్వర్‌తేజ | – | మధిర రూరల్ | – | 6305269141 |
| ఆర్.శ్రీనివాస్ | – | ఎర్రుపాలెం మండలం | – | 8501020885 |
| బుక్య.శ్రీను | – | బోనకల్ | – | 8688810293 |
| సి.మల్లేష్ | – | ఇబ్రహీపట్నం | – | 9618028334 |
| దుంపాల రాజేష్ | – | మేడ్చల్ | – | 9000178307 |
| వై.నర్సింహులు | – | తాండూరు | – | 7207677049 |
| టి.సురేష్ చారీ | – | ఆసిఫాబాద్ | – | 9000983108 |
| డి.భాస్కర్ | – | బెల్లంపల్లి | – | 9440018863 |
| ఐ.నర్సింహయ్య | – | జన్నారం రూరల్ | – | 9493314399 |
| గొట్టె సురేందర్ | – | మంచిర్యాల టౌన్ | – | 9248528680 |
| గొడ్లబాబూరావు | – | తల్లాడ | – | 9848236015 |
| ఎల్.వెంకట్ | – | మందమర్రి | – | 8106891666 |
| మహమ్మద్ హఫీజుద్దీన్ | – | కేతనపల్లి | – | 9701844456 |
| సాయిబాబు | – | భద్రాద్రి కొత్తగూడెం | – | 9603149645 |
| ఎన్.బండయ్య | – | చేవెళ్ల | – | 9959032940 |
| నరేందర్ | – | చేవెళ్ల | – | 9490148304 |
| ఎం.పరమేష్ | – | శంకరపల్లి | – | 7989723793 |
| ఊదిరి మహేష్ | – | చౌటుప్పల్ | – | 9550941419 |
| జి.అర్జున్ | – | శంకరపట్నం | – | 7386777544 |
| ఎం.యాదయ్య | – | చేవేళ్ల నియోజకవర్గం | – | 8328236516 |
| ఎం.మురళీ | – | షాబాద్ | – | 9989770468 |


## హబ్సిగూడ డివిజన్లో రూ 70.5 లక్షలతో అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కార్పొరేటర్



మేడిపల్లి, నవంబర్ 17 (ప్రజాపాలన ప్రతినిధి): హబ్సిగూడ డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తూ గురువారం పలు అభివృద్ధి పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ చేతన హరీష్ ప్రారంభించారు. ఈ మేరకు డివిజన్లోని గణేష్ నగర్, గ్రీన్ హిల్స్ కాలనీలో ఫుట్ పాత్, రోడ్డు వైడనింగ్ మరియు గ్రీన్ బెల్ట్ కోసం రూ70.5 లక్షలతో పనులకు భూమి పూజా ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి, కార్పొరేటర్ చేతన్ హరీష్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ మున్సిపల్ ఈఈ నాగేందర్, డీఈ నాగమణి, ఏఈ సాయి కుమార్, హబ్సిగూడ, రామంతాపూర్ డివిజన్ టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ బి.వి చారి, ఎండి ముస్తాక్, ప్రధాన కార్యదర్శులు కంచర్ల సోమిరెడ్డి, జెసిబి రాజు, ఉపాధ్యక్షుడు ఎల్లంకి రవీందర్ రెడ్డి, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు గరిక సుధాకర్, వనంపల్లి గోపాల్ రెడ్డి, నందికంటి శివ, బిజెపి నాయకులు సంజయ్ పటేల్, గంగా, యమునా, సరస్వతి అపార్ట్మెంట్స్ అసోసియేషన్ సభ్యులు వెంకట్ రెడ్డి, దిలీప్, రాధాకృష్ణ, అశోక్ రావు, రాజిరెడ్డి, నాగ సాయినాథ్, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య




బెల్లంపల్లి నవంబర్ 17 ప్రజా పాలన ప్రతినిధి: బెల్లంపల్లి నియోజకవర్గం కాసిపేట మండల కో ఆప్షన్ సభ్యుడు సిరాజ్ ఖాన్ కూతురి వివాహానికి గురువారం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ చంద్రయ్య , వైస్ ఎంపీపీ విక్రమ్ , మాజీ జడ్పీటీసీ సత్తయ్య , ముత్యంపల్లి ఉపసర్పంచ్ తిరుపతి , ప్రజాప్రతినిధులు, తెరాస నాయకులు, ఎంపీడీఓ అలీం , తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



బెల్లంపల్లి నవంబర్ 17 ప్రజా పాలన ప్రతినిధి: బెల్లంపల్లి ఏరియా సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం ఎస్ సి కేఎస్ (సి.ఐ.టి.యు) 6వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు వెలిశాల కృష్ణమాచారి విజ్ఞప్తి చేశారు. గురువారం నాడు బెల్లంపల్లి ఏరియాలోని కూడా ఓసీపీలో మహాసభల గోడ ప్రతులను ఆయన విడుదల చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియా సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం ఆరవ రాష్ట్ర మహాసభలను నవంబర్ 26, 27 తేదీలలో శ్రీరాంపూర్, మంచిర్యాలలో, జరుప తలపెట్టామని కాంట్రాక్టు కార్మికులందరూ అధిక సంఖ్యలో హాజరై సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమములో డ్రైవర్ల సంఘం నాయకులు శ్రీనివాస్, సివిల్ డిపార్ట్మెంట్ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించిన పట్నం మహేందర్ రెడ్డి



చెవెళ్ల నవంబర్ 17 (ప్రజాపాలన):చేవెళ్ల మండల కేంద్రంలోని మహేందర్ రెడ్డి జనరల్ ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని, రూ. 2 కోట్లతో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని గురువారం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కళాశాల చైర్మన్ పట్నం మహేందర్ రెడ్డిప్రారంభించారు. పేదలకు మెరుగైన సేవలు అందించడమే లక్షమని ఆయన అన్నారు. కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధ పడే వారికి అతి తక్కువ ఖర్చుతో డయాలసిస్ సేవలు అందిస్తామని, చుట్టూ పక్క గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒక చేవెళ్ల మండలంలోనే 82 మందికి పైగా డయాలసిస్ రోగులు ఉన్నారని, స్థానికంగా వైద్య సేవలు అందుబాటులో లేక నగరంలోని కార్పొరేట్, ప్రయివేట్ ఆసుపత్రులకు వేలాల్సి వస్తుందన్నారు. తమ ఆసుపత్రిలో అన్ని రకాల వ్యాధులకు నిష్ణాతులైన వైద్యులు ఉన్నారని తెలిపారు. త్వరలోనే డయాలసిస్ రోగులకు ఆరోగ్య శ్రీ సేవలు సైతం అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఆసుపత్రిలో ఆపరేషన్లు చేసిన తర్వాత నొప్పులు తెలియకుండా ఆరోగ్యం మెరుగుపడేందుకు మత్తు మందులు ఉన్నాయని అనస్థీషియ వైద్యురాలు సునీత తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్నం మహేందర్ రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ డీన్, ప్రిన్సిపాల్ జోయరాని, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వర్ రావు, సీనియర్ ఫ్యాకల్టీ రాజారెడ్డి, మేనేజర్ నాగేశ్వర్ రావు, అనస్థీషియ వైద్యురాలు సునీత, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాసన్నగారి మణిక్యారెడ్డి, నాయకులు రఘువీర్ రెడ్డి, వైద్యులు, సిబ్బంది తదితరులు ఉన్నారు..

# పినపాక నియోజకవర్గం అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించిన అభివృద్ధి ప్రదాత పినపాక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ రేగా కాంతారావు



బూర్గంపాడు (ప్రజా పాలన.)పినపాక నియోజకవర్గం అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించిన తెలంగాణ ప్రభుత్వం. నిధులు తీసుకురావడంలో పినపాక నియోజకవర్గం అభివృద్ధి చెందడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్న ప్రభుత్వ విప్ పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు. పినపాక నియోజకవర్గం లో ఉన్నటువంటి రోడ్ల అభివృద్ధికి సుమారుగా 27 కోట్ల రూపాయలను తీసుకు రావడంలో కృతకృత్యులయ్యారని చెప్పవచ్చు. దానిలో భాగంగా బూర్గంపాడు మండలానికి ఆరు కోట్ల రూపాయల కేటాయించడంపై జడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత మరియు ప్రజల వర్షం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో అన్ని మండలాల అభివృద్ధికి నిధులు కేటాయించినట్లు రేగా కాంతారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మండలం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అందరూ భాగంగానే రోడ్లు, డ్రైనేజీలు,మంచినీళ్లు, ప్రాధాన్యత ఇస్తున్నట్లు వారు తెలియజేశారు. అంతేకాకుండా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని రైతుల కోసం రైతు బీమా, రైతు బంధు, ప్రజల కోసం మిషన్ భగీరథ, న ఇంటింటికి నీళ్లు తీసుకువచ్చిందని, తెలంగాణ ఆడపడుచుల కోసం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి అమోఘమైన పథకాలు తీసుకొచ్చి ప్రజలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని అందులోనే భాగంగా దళిత బంధు పథకం దేశంలోనే నెంబర్ వన్ గా నిలిచిందని దళితుల అభివృద్ధికి ఈ పథకం ఎంతో తోడ్పడుతుందని వారు తెలియజేశారు. ఇంకా రైతులకు 24 గంటలు కరెంటు తీసుకువచ్చి రైతులకు ఈ ప్రభుత్వం ఎంతో మేలు చేస్తుందని వారు తెలిపారు. రాబోయే కాలంలో ప్రభుత్వం మరింతగా అభివృద్ధిలో దూసుకుపోతుందని ప్రజలను అదేవిధంగా ఎవరైతే వారిని ఆదుకుంటారో ప్రజలు సునిసితంగా చూస్తున్నారని మరలా బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని వారు తెలియజేశారు.

## అంగన్వాడి పిల్లలుకు అక్షరబ్యాసం చేయించిన సర్పంచ్



బోనకల్, నవంబర్ 17 ప్రజాపాలన ప్రతినిధి: మండల పరిధిలోని ఆళ్లపాడు అంగన్వాడీ 1వ కేంద్రంలో గురువారం సర్పంచ్ మర్రి తిరుపతిరావు అంగన్వాడి పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మర్రి తిరుపతి రావు మాట్లాడుతూ మేను ప్రకారం పిల్లలకు కావలసిన పోషక పదార్థాలు అందించాలని, అంగన్వాడి కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అంగన్వాడి టీచర్ కు తెలియజేశారు. అనంతరం పిల్లలకు పాలు, గుడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మర్రి తిరుపతి రావు, అంగన్వాడీ టిచర్ గౌరమ్మ, అయా పిల్లలు పాల్గొన్నారు.

## అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని వామపక్షాల ధర్నా



ఆసిఫాబాద్ జిల్లా నవంబర్ 17 (ప్రజాపాలన, ప్రతినిధి) : జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద గురువారం వామపక్షాల ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా కార్యక్రమానికి ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు కోట్నాక విజయ్ కుమార్ పూర్తి మద్దతు పలికారు. ఈ సందర్భంగా కోట్నాక విజయ్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ అవినీతి అక్రమాలను ప్రోత్సహిస్తున్నాడని, ఇంతకుముందు జిల్లాకు వచ్చిన కలెక్టర్లు అవినీతిని అరికడుతూ ప్రజల సమస్యలను తీర్చే వారన్నారు. ఇప్పుడున్న కలెక్టర్ రాహుల్ రాజ్ అత్యంత గౌరవప్రదమైన ఐఏఎస్ ను అవమానం చేసేలా అవినీతి అధికారులను ప్రోత్సహిస్తూ టిఆర్ఎస్ నాయకుడి లాగా పనిచేస్తున్నాడని, కనీసం ప్రజలని ప్రజల సమస్యలను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్న తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. ఆదివాసి హక్కుల పోరాట సాధ్యం దెబ్బ ఆధ్వర్యంలో ఆదివాసీల సమస్యలపై అనేకసార్లు వినతి పత్రాలు ఇచ్చిన కనీసం స్పందన లేకుండా ఉన్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమాలకు పాల్పడిన ఆర్డిఓ పై ఇంతవరకు చర్యలు తీసుకోకుండా ఉన్నారని అన్నారు. ఆర్డీవో చేస్తున్న కుంభకోణాలకు ఏమైనా వాటాలు అందుతున్నాయా అని అన్నారు. అధికార పార్టీ అండ దండాలతో ఉన్నారని, ఇలాంటి కలెక్టర్ కొమురం భీం జిల్లాలో పనికిరాడని, వెంటనే ప్రభుత్వం స్పందించి బదిలీ చేయాలని, కోరారు. బదిలీ చేయని యెడల అన్ని సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో బిజెపి, కాంగ్రెస్, బీఎస్పీ, వామపక్షాలు విద్యార్థి యువజన సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

## దళితులను మోసం చేస్తున్న టిఆర్ఎస్ ప్రభుత్వం



మధిర నవంబర్ 17 (ప్రజా పాలన ప్రతినిధి) ఎన్నికలకు ముందు దళితులకు ఇచ్చిన అనేక హామీలను అమలు చేయకుండా టిఆర్ఎస్ ప్రభుత్వం దళితులను మోసం చేస్తుందని బిజెపి దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి పెరుమాళ్ళపల్లి విజయరాజు ఆరోపించారు. గురువారం నిధానపురం గ్రామంలో బిజెపి ఆధ్వర్యంలో దళిత బస్తి సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నరేంద్ర మోడీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ఆయన మాట్లాడారు. పల్లెలను అభివృద్ధి చేస్తూ, గ్రామపంచాయతీలకు 90 శాతం నిధులు కేటాయిస్తూ, అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తున్న ఏకైక నాయకుడు నరేంద్ర మోడీ అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి దళితుడు అని, మూడు ఎకరాల వ్యవసాయ భూమి అని, దళిత బంధువు అని అనేక హామీలతో దళితులను వంచిస్తున్న టిఆర్ఎస్ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి చిలివేరు సాంబశివరావు, దేవరకొండ కోటేశ్వరరావు, గుండా చంద్రశేఖర్ రెడ్డి, పాపట్ల రమేష్, పెరుమాళ్ళపల్లి మోహన్ రావు, వేణు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న కవి సమ్మేళనం

### గ్రంథాలయ చైర్మన్ కనక యాదవ రావు



ఆసిఫాబాద్ జిల్లా నవంబర్ 16 (ప్రజాపాలన, ప్రతినిధి) : జాతీయోద్యమంతో పాటు తెలంగాణ ఉద్యమంలో కవులు, కళాకారుల, పాత్ర వెలకట్టలేనిదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు అన్నారు. బుధవారం జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన కవి సమ్మేళన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కవులు సామాజిక రుగ్మతల్ని పోగొట్టేలా కవితలు రాయాలన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి సూచనలు అందించాలని కోరారు. వచ్చే ఏడాదిలోగా రూ 1.5 పోట్లతో నూతన గ్రంథాలయ నిర్మాణాన్ని పూర్తి చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కవి సమ్మేళనంలో కవుల కవితల్ని ప్రశంసించారు. ఈ సమావేశంలో అవధాని మడుపుల సత్యనారాయణ మూర్తి, ఆసిఫాబాద్ కవుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు కృష్ణమాచార్యులు, రాధాకృష్ణ చారి, వ్యవస్థాపకులు నల్గొండ రమేష్ చారి, గౌరవ సలహాదారులు డి వెంకటేశ్వర్లు, కవులు శ్రీరాం సత్యనారాయణ, ఢిల్లీ విజయ్ కుమార్, పూర్ణచందర్ రావు వైద్య, పెంటయ్య, రేవతి, జ్యోతి, పాల్గొని, తమ కవితలతో ఆలదించారు.

## ఘనంగా లాలా జలపతిరాయ్ వర్ధంతి

### నివాళులర్పించిన అరిగెల నాగేశ్వర్ రావు




ఆసిఫాబాద్ జిల్లా నవంబర్ 17 (ప్రజాపాలన, ప్రతినిధి) : స్వాతంత్ర సమరయోధుడు లాల జలపతిరాయ్ వర్ధంతిని జెడ్పిటిసి అరిగెల నాగేశ్వర్ రావు నివాసంలో లాలా జలపతిరాయ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ రావు మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న త్రిమూర్తులలో లాలాజలపతిరాయ్ (బాల గంగాధర్ తిలక్- బిపిఎన్ చంద్రబాల్ ) ఒకరు అన్నారు. ఈయనకు పంజాబ్ కేసరి అనే బిరుదు ఉందని, ఆయన సైమాన్ కమిషన్ కు వ్యతిరేకంగా చేసిన పోరాటంలో లాటి దెబ్బలు తగిలి మరణించాడు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంధం శ్రీనివాస్, నాయకులు గుండా వెంకన్న, సర్పంచులు భీమేష్, శ్రీనివాస్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## నో మనీ ఫర్ టెర్రర్.. చైనాకు ఆహ్వానం.. పాక్‌కు నో ఎంట్రీ



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో రేపటి నుంచి నో మనీ ఫర్ టెర్రర్ అంశంపై అంతర్జాతీయ సదస్సు జరగనున్నది. మూడవ దఫా సదస్సులో 78 దేశాలతో పాటు అనేక బహుళజాతి సంస్థలు పాల్గొంటున్నట్లు ఎన్ఐఏ డైరక్టర్ జనరల్ దినకర్ గుప్తా తెలిపారు. నో మనీ ఫర్ టెర్రర్ కాన్ఫరెన్స్‌లో పాకిస్థాన్ పాల్గొనడం లేదన్నారు. హవాలా లావాదేవీలకు చెందిన సంప్రదాయ పద్ధతులు, ఉగ్రవాదులకు ఫైనాన్సింగ్ అంశాలను సదస్సులో చర్చించనున్నట్లు దినకర్ వెల్లడించారు. 20 దేశాలకు చెందిన మంత్రులు కూడా ఈ సమావేశాలకు హాజరుఅవుతున్నారు. ఉగ్రవాద కార్యకలాపాలు చాలా వరకు తగ్గాయని, కానీ విధ్వంసకర తీవ్రవాదంపై పోరాటాన్ని కొనసాగించాలని దినకర్ గుప్తా తెలిపారు. ఉగ్రవాదులు సోషల్ మీడియాను ఎక్కువగా వాడుతున్నారని, ఈ అంశాన్ని చర్చించాల్సి ఉందని ఆయన చెప్పారు. నో మనీ ఫర్ టెర్రర్ కాన్ఫరెన్స్‌కు చైనాను ఆహ్వానించినట్లు కేంద్ర విదేశాంగ శాఖ కార్యదర్శి సంజయ్ వర్మ తెలిపారు.

## బ్రిటీషర్లకు సావార్కర్ భయపడ్డారు: రాహుల్ గాంధీ



అకోలా: హిందుత్వవాది వినాయక్ దామోదర్ సావార్కర్‌పై రాహుల్ గాంధీ ఇవాళ కూడా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారత్ జోడో యాత్రలో భాగంగా మహారాష్ట్రలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆయన ఇవాళ మీడియాతో మాట్లాడారు. వీడీ సావార్కర్‌పై మళ్లీ ఆరోపణలు గుప్పించారు. బ్రిటీషర్లకు సావార్కర్ భయపడ్డారని, వాళ్లకు సేవకుడిగా పని చేసుకునేందుకు ఆయన ప్రయత్నించారని, దీని కోసం బ్రిటీషర్లకు సావార్కర్ లేఖలు కూడా రాసినట్లు రాహుల్ తెలిపారు. కొన్ని రోజుల క్రితం సావార్కర్‌పై రాహుల్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన ఇవాళ కూడా ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోలేదు. కావాలంటే మహారాష్ట్ర ప్రభుత్వం తనను అరెస్టు చేసుకోవచ్చు అని కూడా రాహుల్ సవాల్ చేశారు.

## ఘనంగా జన్ జాతీయ గౌరవ దివస్ దినోత్సవం



భద్రాచలం (ప్రజా పాలన.) :భద్రాచలంలో స్వాతంత్ర సమరయోధులు మరియు పద్మశ్రీ అవార్డు గ్రహీతలకు సన్మానం తో పాటు వారం రోజులు పాటు ప్రతి ఆశ్రమం పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని గిరిజన సంక్షేమ శాఖ డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని రమాదేవి అన్నారు. గురువారం నాడు జన్ జాతీయ గౌరవ దివస్ దినోత్సవ సందర్భంగా భద్రాచలంలోని ఆశ్రమ గిరిజన సంక్షేమ శాఖ బాలికల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అమరులైన చిత్రపటాలకు పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించిన అనంతరం ఆమె మాట్లాడుతూ బిర్సా ముండా చిన్న వయసులో ఉద్యమం చేపట్టారని ఆదివాసీలకు ఒక దాటిపై నిలవడానికి కృషిచేసిన మహోన్నత వ్యక్తి అని ఆమె అన్నారు. భారత స్వాతంత్ర ఉద్యమ చరిత్రలో నిలిచిపోయారని ఆదివాసుల సంక్షేమానికి పోరాడిన మహా వ్యక్తి అని అన్నారు. ఆదివాసుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో రకాల సంక్షేమ పథకాలు విడుదల చేయడం జరిగిందని దానిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుంటూ ఆదివాసీల ఆచార వ్యవహారాలు మర్చిపోకుండా భద్రాచలంలోని ఐటిడిఏ ప్రాంగణంలో ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏటి డి ఓ నరసింహారావు ట్రైబల్ మ్యూజియం ఇంచార్జ్ వీరస్వామి మరియు పాఠశాలకు సంబంధించిన ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి సెంటర్ లో అన్నప్రాసన



మధిర నవంబర్ 17 (ప్రజా పాలన ప్రతినిధి) మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి 7వ వార్డులో ఉన్న అంగన్వాడి కేంద్రంలో గురువారం చిన్నారులకు అన్నప్రాసన వేడుకను ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ టీచర్ సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏడవ వార్డు కౌన్సిలర్ మేడికొండ కళ్యాణి కిరణ్ పాల్గొని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అంగన్వాడీ కేంద్రంలో అందిస్తున్న పోషకాహారం గురించి అవగాహన కల్పించారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా ప్రభుత్వ అందిస్తున్న పౌష్టికాహారాన్ని చిన్నారులు బాలింతలు గర్భిణీలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాల్లో ఫోటోగ్రాఫర్లకు ప్రాధాన్యత కల్పించాలి



మధిర నవంబర్ 17 (ప్రజాపాలన ప్రతినిధి) ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో ఫోటోగ్రాఫర్లకు ప్రాధాన్యతను ఇవ్వాలని మండల ఫోటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షురాలు అంగడాల పార్వతి కోరారు. గురువారం మండల పరిధిలోని ఆత్కూరు అబ్బూరి వారి మామిడి తోటలో ఫోటో మరియు వీడియో గ్రాఫర్స్ సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్ల సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం ఫోటోగ్రాఫర్లకు ప్రత్యేక రుణాలు ఇవ్వాలని ఆమె కోరారు. అనంతరం నూతన యూనియన్ ధరల పట్టికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మధిర మండల యూనియన్ సభ్యులు ఫోటోగ్రాఫర్స్ వీడియో గ్రాఫర్స్ పాల్గొన్నారు.




మీరు ఇల్లు / స్థలం కొనాలనుకుంటున్నారా...
లేదా అమ్మాలనుకుంటున్నారా?
అయితే ....
ఈ ప్రకటన మీకోసమే
సంప్రదించండి
8886911944



# కూతురు సినీ ఎంట్రీపై రోజా క్లారిటీ



ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి రోజా గురువారం తన పుట్టినరోజు సందర్భంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన రోజా.. తన కూతురు కుమారుడి సినీ ఎంట్రీపై కీలక వ్యాఖ్యలు చేశారు. రోజాతోపాటు శ్రీవారి దర్శనం చేసుకున్న వారిలో ఆమె సన్నిహితులు జబర్దస్త్ వర్ష ప్రముఖ సింగర్ మంగ్లీ కూడా ఉన్నారు.శ్రీవారిని దర్శించుకున్న అనంతరం రోజా మీడియాతో మాట్లాడారు. కార్తీకమాసం సందర్భంగా తిరుమల రావడం.. తన పుట్టినరోజు సందర్భంగా స్వామి వారి ఆశీసులు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.తాను తిరుపతి ప్రాంతంలో పుట్టడం.. రాజకీయాల్లోకి వచ్చి మంత్రిగా రావడం అదృష్టంగా భావిస్తున్నట్టు రోజా తెలిపారు. శత్రువులను ఎదుర్కొనే శక్తిని ఇవ్వమని స్వామివారిని కోరుకున్నట్టు మంత్రి రోజా తెలిపారు. ఈ సందర్భంగా రోజా తన కూతురు అన్షు మాలిక సినీ ఎంట్రీపై కీలక వ్యాఖ్యలు చేశారు.యాక్టింగ్ చేయడం తప్పని తాను ఎప్పుడూ అనను అని రోజా చెప్పారు. తన కొడుకు కూతురు యాక్టింగ్ చేయాలని సినిమా ఇండస్ట్రీకి వస్తే తాను సంతోషంగా ఫీల్ అవుతానని తెలిపారు.తన కూతురికి చదువుకోవాలని.. సైంటిస్ట్ అవ్వాలనే ఆలోచన ఉందని తెలిపారు. తన కూతురు ప్రస్తుతం బాగా చదువుతోందని.. ఇప్పటికైతే సినిమాల్లోకి వచ్చే ఆలోచన లేదని తెలిపారు. సినిమాల్లోకి వస్తే మాత్రం ఒక తల్లిగా హీరోయిన్ గా తన ఆశీస్సులు ఉంటాయని తెలిపారు.రోజా కూతురు అన్షు మాలికకు అరుదైన గౌరవం దక్కింది. ప్రఖ్యాత అన్షు ఎన్సర్ యూకే మ్యాగజైన్ కవర్ పేజీపై ఆమె ఫొటోను ప్రచురించడం విశేషం. ఒక రచయితగా.. ఎంటర్ ప్రెన్యూనర్ గా ప్రోగ్రామర్ గా సమాజం కోసం పాటుపడుతున్నందుకు యంగ్ సూపర్ స్టార్ అవార్డుకు ఆమె ఎంపికైనట్లు ఇన్షు ఎన్సర్ సంస్థ ప్రకటించింది.

## యుద్ధానికి సన్నద్ధం అవుతున్న చిరుత..!



ఆర్ఆర్ఆర్ హిట్ తో సూపర్ జోష్ లో ఉన్న చరణ్ ప్రస్తుతం శంకర్ డైరెక్షన్ లో మూవీ చేస్తున్నాడు. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ మూవీలో బాలీవుడ్ భామ కియరా అద్వాని హీరోయిన్ గా నటిస్తుంది. పాన్ ఇండియా రేంజ్ లో రిలీజ్ ప్లాన్ చేసిన ఈ మూవీ షూటింగ్ న్యూజిలాండ్ లో జరుగుతుంది. రీసెంట్ గా చిత్రయూనిట్ అంతా అక్కడ షిఫ్ట్ అయ్యారు. న్యూజిలాండ్ లో భారీ షెడ్యూల్ ఒకటి ప్లాన్ చేశారు. ఒక పాట.. కొన్ని ఇంపార్టెంట్ ఫైట్ సీన్స్ ఈ షెడ్యూల్ లో పూర్తి చేస్తారని తెలుస్తోంది.న్యూజిలాండ్ వెళ్లిన చరణ్ అండ్ టీం అక్కడ సూపర్ వర్క్ అవుట్స్ చేస్తున్నారు. ముఖ్యంగా అక్కడ ఫైట్ సీన్స్ కోసం చరణ్ వర్క్ అవుట్స్ బాగా చేస్తున్నాడు. దానికి సంబందించిన ఒక వీడియో తన సోషల్ మీడియాలో షేర్ చేశారు చరణ్.తన ట్రైనర్ తో వర్క్ అవుట్స్ చేస్తూ యాక్షన్ సీన్స్ కి రెడీ అవుతున్నాడు చరణ్. అంతేకాదు తన టీం తో ఫుట్ బాల్ లాంటి ఆటలు కూడా ఆడుతున్నారు. స్విమ్మింగ్ వర్క్ అవుట్స్ ఇలా అన్నీ చేస్తూ యుద్ధానికి సన్నద్ధం అవుతున్నాడు చిరుత. శంకర్ సినిమా అంటేనే భారీతనం అందుకే ఈ సినిమా కోసం ఎక్కడ కాంప్రమైజ్ అవకుండా నిర్మాత దిల్ రాజు ఖర్చు పెడుతున్నారు.సినిమాకు థమన్ మ్యూజిక్ అందిస్తున్నారు. అల వైకుంఠపురం లో సినిమాతో నేషనల్ అవార్డ్ అందుకున్న థమన్ అవార్డ్ ఇచ్చిన ప్రోత్సాహంతో వరుస సినిమాలు చేస్తున్నాడు. ఆర్సీ 15 సినిమాకు కూడా థమన్ అదిరిపోయే మ్యూజిక్ అందిస్తున్నట్టు తెలుస్తుంది. శంకర్ తన మొదటి సినిమా నుంచి 2.0వరకు ఏ.ఆర్. రెహమాన్ తోనే మ్యూజిక్ కంపోజ్ చేయించారు. ఈసారి ఆయన్ని కాదని థమన్ కి ఈ ఛాన్స్ ఇచ్చారు. మరి ఈ సదవకాశాన్ని థమన్ ఎలా సద్వినియోగ పరచుకుంటాడో చూడాలి. ఆర్.ఆర్.ఆర్ సినిమాలో సీతారామ రాజు పాత్రలో అదరగొట్టిన చరణ్ మరోసారి శంకర్ సినిమాతో ప్రేక్షకులను అలరించాలని ఫిక్స్ అయ్యాడు. సినిమా కోసం ఎంత కష్టమైనా పడేందుకు రెడీ అంటున్న చరణ్ సినిమా కోసం భారీ వర్క్ అవుట్స్ కూడా చేస్తున్నారు.రంగస్థలం నుంచి నటుడిగా మరో మెట్టు ఎక్కిన చరణ్ సినిమా ఫలితం ఎలా ఉన్నా తన వరకు సూపర్ హిట్ అనిపించుకుంటున్నాడు. ఆర్.ఆర్.ఆర్ తర్వాత శంకర్ సినిమాతో పాన్ ఇండియా రేంజ్ లో తన ప్రభంజనం సృష్టించడానికి సిద్ధమవుతున్నాడు రాం చరణ్.

## ఎట్టకేలకు ఆ దర్శకుడి కొత్త ప్రాజెక్ట్ సెట్ అయిందా..?



సినీ ఇండస్ట్రీలో సక్సెస్ ఒక్కటే మాట్లాడుతుంది. హిట్లు వచ్చినప్పుడు మెచ్చుకున్నవారే.. ఒక్కసారి ఫ్లాప్ వస్తే విమర్శలు చేస్తారు. అలానే సినిమా చేస్తామని ముందుకు వచ్చినవారు కూడా మొహం చాటేస్తారు. చివరకు అంతకుముందు మాట్లాడిన మాటలు కూడా అన్నీ ప్రతికూలంగా మారిపోతాయి. ఇవన్నీ టాలీవుడ్ టాలెంటెడ్ డైరెక్టర్ అజయ్ భూపతి విషయంలో జరిగాయి.'100' సినిమాతో డైరెక్టర్ గా పరిచయమైన అజయ్ భూపతి.. వైలెంట్ లవ్ స్టోరీతో సెన్సేషనల్ హిట్ అందుకున్నారు. ఫస్ట్ మూవీతోనే అందరి దృష్టిని ఆకర్షించి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారిపోయారు. ఈ నేపథ్యంలో దాదాపు మూడేళ్ళ గ్యాప్ తీసుకొని శర్వానంద్ – సిద్దార్థ్ వంటి మంచి మార్కెట్ ఉన్న హీరోలతో చేసిన 'మహాసముద్రం' సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ గా నిలిచింది.'మహాసముద్రం' సినిమాను అజయ్ భూపతి డిఫరెంట్ గా ప్లాన్ చేసినప్పటికీ.. ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. ఒకప్పుడు రొటీన్ సినిమాలు కోరుకునే వాళ్ళు తన 'ఆర్ఎక్స్ 100' చిత్రాన్ని చూడటానికి రావొద్దని చెప్పిన దర్శకుడు.. రెండో సినిమాని ఇలా తీశారేంటి అని ట్రోల్ చేసారు. ఈ సినిమా వచ్చి ఏడాది దాటిపోయినా ఇంతవరకూ అజయ్ కొత్త ప్రాజెక్ట్ అనౌన్స్ మెంట్ రాలేదు.'మహాసముద్రం' ఫ్లాప్ తర్వాత పలువురు హీరోలకు కథలు వినిపించిన అజయ్ భూపతి.. చివరకు ఓ ఓటీటీ ప్రాజెక్ట్ చేయడానికి అంగీకరించారని ఆ మధ్య టాక్ వచ్చింది. అయితే ఇప్పుడు విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సరికొత్త కాన్సెప్ట్ తో రా అండ్ రస్టిక్ సినిమా చేయడానికి రెడీ అవుతున్నాడని వార్తలు వస్తున్నాయి. అజయ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించడమే కాకుండా.. నిర్మాణంలో భాగస్వామ్యం పంచుకోనున్నట్లు చెబుతున్నారు.విభిన్నమైన కాన్సెప్ట్ తో తెరకెక్కే ఈ థ్రిల్లర్... రెగ్యులర్ హీరో – విలన్ సినిమాగా కాకుండా పాత్రల ప్రధానంగా ఉంటుందని అంటున్నారు. ఇందులో తెలుగు యాక్టర్స్ మాత్రమే కాకుండా.. ఇతర భాషల నటీనటులు కూడా ఉంటారట. దీనికి 'మంగళవారం' అనే టైటిల్ కూడా ప్రచారంలోకి వచ్చింది. త్వరలోనే ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించి సెట్స్ మీదకు తీసుకెళ్లారని టాక్. అయితే అజయ్ భూపతి ఈ సినిమాని బిగ్ స్క్రీన్ కోసం తీస్తున్నారా? లేదా ఓటీటీ కోసం చేస్తున్నారా? అనేది తెలియాల్సి ఉంది. 'మహాసముద్రం' సినిమాతో అంచనాలను అందుకోలేకపోయినందుకు క్షమించమని అజయ్ భూపతి అప్పట్లో ట్వీట్ చేసాడు. నెక్స్ట్ టైం అందరినీ సంతృప్తి పరిచే కథతో తిరిగి వస్తానని హామీ ఇచ్చాడు. ఈ క్రమంలో ఇప్పుడు మరో మంచి కాన్సెప్ట్ తో ప్రేక్షకులను ఆకట్టుకునే సినిమా చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ ప్రాజెక్ట్ కు సంబంధించిన వివరాలు వెల్లడిస్తారేమో చూడాలి.

## విలక్షణ నటుడితో మళ్లీ యూనివర్శిల్ స్టార్



యూనివర్శిల్ స్టార్ కమల్ హాసన్ హీరోగా ఇక మీదట సినిమాలు చేయడేమో అంటూ గత పదేళ్లుగా ప్రచారం జరుగుతూనే ఉంది. పైగా ఆయన రాజకీయాలతో బిజీ అవ్వబోతున్నాడు అని... సినిమాల్లో హిట్స్ పడక పోవడం వల్ల ఇండస్ట్రీకి దూరం అయ్యే ఆలోచనలో ఉన్నాడు అంటూ వార్తలు గుప్పుమన్నాయి. ఆ సమయంలో వచ్చిన విక్రమ్ మొత్తం పరిస్థితిని మార్చి వేసింది.ఏడాదికి ఒకటి అర సినిమాలు చేస్తూ వచ్చిన కమల్ హాసన్ విక్రమ్ సినిమా తర్వాత ఏకంగా అరడజనుకు పైగా సినిమా లను లైన్ లో పెట్టాడు. రికార్డు బ్రేకింగ్ వసూళ్లు నమోదు చేసిన విక్రమ్ సినిమా వల్ల వరుసగా సినిమాలు చేయాలని కమల్ భావిస్తున్నాడు అనే వార్తలు వస్తున్నాయి. అందులో భాగంగానే హెచ్ వినోద్ దర్శకత్వంలో ఒక సినిమాను కమల్ హాసన్ కన్ఫర్మ్ చేయడం జరిగింది. హెచ్ వినోద్ వరుసగా అజిత్ తో సూపర్ హిట్ సినిమాలను చేసి తమిళ్ సినీ ఇండస్ట్రీ లో టాప్ డైరెక్టర్ గా పేరు దక్కించుకున్నాడు. ఇలాంటి సమయంలో హెచ్ వినోద్ దర్శకత్వం లో కమల్ హాసన్ మూవీ అంటే చాలా స్పెషల్ గా ఉంటుంది అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు చాలా నమ్మకంతో ఉన్నారు.

## కాంతారలో రిషిబ్ శెట్టి వైఫ్ నటించారా?



ఎలాంటి హడావుడి లేకుండా వచ్చి.. బాక్సాఫీస్ దుమ్ము దులి పేస్తున్న కాంతారకు సంబంధించిన ఆసక్తికర అంశాలు బోలెడన్ని ఒకటి తర్వాత ఒకటి చొప్పున బయటకు వస్తున్నాయి. తాజాగా అలాంటి ఉదంతమే ఒకటి బయటకు వచ్చింది. ఈ మూవీలో హీరోగా నటించి.. సినిమాకు దర్శకుడిగా రిషిబ్ శెట్టి టాలెంట్ ఏమిటన్నది ఇప్పుడు అందరికి తెలిసిపోయింది. అతగాడు నటించిన గత సినిమాలు చూస్తే.. అతడెంత వైవిధ్యమైన ఆర్టిస్టు అన్న విషయం తెలుస్తుంది. కానీ.. అతగాడి గొప్పతనం మాత్రం పెద్దగా బయటకు రాలేదు. కాంతార ఆ కొరతను తీర్చేయటమే కాదు.. యావత్ భారతానికి అతడ్ని సుపరిచితుడిగా మార్చేసింది.ఒక్క సినిమాతో అతగాడి ఇమేజ్ భారీగా పెరిగిపోయింది. ఇక.. ఈ మూవీలో రిషిబ్ సతీమణి యాక్ట్ చేశారా? అంటే అవునంటున్నారు. మరి.. ఆమె ఎక్కడా కనిపించలేదే? అన్న క్వశ్చన్ రావొచ్చు. కానీ.. జాగ్రత్తగా చూస్తే.. ఆమె కనిపించేస్తుంది. అంతేకాదు. .ఈ మూవీకి క్యాస్టూమ్ డిజైనర్ అన్న కీ రోల్ ను ఆమె పోషించారు. ఇందుకోసం ఆమె పడిన కష్టంఅంతా ఇంతా కాదు.ఇంతకీ ఆమె పేరేమిటి? ఆమె బ్యాక్ గ్రౌండ్ ఏమిటి? అన్నది చూస్తే.. భర్త రిషిబ్ మాదిరే మల్టీ టాలెంటెడ్ అని చెప్పాలి. రిషిబ్ శెట్టి సతీమణి పేరు ప్రగతీ శెట్టి. వాస్తవానికి ఆమె ప్రముఖ ఐటీ కంపెనీలో ప్రాజెక్టు ఇంజినీర్ గా పని చేశారు. ఆ తర్వాత ఆమెకు క్యాస్టూమ్ డిజైనర్ గా పని చేయాలన్న తపనతో ఉద్యోగానికి గుడ్ బై చెప్పేసి.. తనకు నచ్చిన రంగంలోకి వచ్చేశారు. అదే సమయంలో నటన మీద తనకున్న అభిరుచికి తగ్గట్లుగా ఆమె కొన్ని పాత్రల్ని పోషిస్తుంటారు.అలాంటి చిన్న పాత్రనే కాంతార మూవీలో పోషించారు. సినిమా ఆరంభంలో రాజు ఎపిసోడ్ వస్తుంది కదా? ఆ రాజు సతీమణిగా ప్రగతీ శెట్టి నటించారు. చాలా తక్కువ నిడివి ఉన్న ఈ పాత్రను పోషించే సమయానికి ఆమె గర్భవతి. ఒకవైపు ప్రెగ్నెంట్ గా ఉంటూనే సినిమాకు సంబంధించిన కాస్టూమ్ డిజైనింగ్ కోసం అడవుల చుట్టూ తిరిగి.. సహజ సిద్ధంగా ఉండేలా క్యాస్టూమ్స్ ను సిద్ధం చేసింది.ఈ మూవీలో తాను కనిపించే తక్కువ నిడివిలోనూ మూడు చీరలు ధరించిన ఆమె.. అందులో ఒక చీర తన తల్లి పెళ్లినాడు ధరించిన చీర అని చెప్పుకొచ్చింది.

## డైలమాలో స్టార్ ప్రొడక్షన్ హౌస్ లు..?

టాలీవుడ్ లో ఒక్కో హీరోకు ఒక్కో కోటరీస్ వుండేవి. ఆ కోటరీకి చెందిన వారు మాత్రమే ఒక హీరోతో సినిమాలు నిర్మించేవారు. వారితో తప్ప స్టార్ హీరోలు మరో నిర్మాతకు ఛాన్స్ ఇచ్చేవారు కాదు. అయితే ఈ మధ్య అలాంటి కోటరీలు ఏవీ కనిపించడం లేదు. స్టార్ హీరోతో సినిమా తీయాలని ముందుకొచ్చే ప్రతీ ప్రొడక్షన్ హౌస్ తో అందరు హీరోలు కలిసి సినిమాలు చేస్తున్నారిప్పుడు. అలా అంతరు హీరోలు కలిసి సినిమాలు చేస్తున్న టాలీవుడ్ టాప్ ప్రొడక్షన్ హౌసెస్ ఇప్పుడు డైలమాలో పడ్డాయా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది.టాలీవుడ్ లో వున్న టాప్ ప్రొడక్షన్ కంపనీలు మైత్రీ మూవీ మేకర్స్..పీపుల్ మీడియా ఫ్యాక్టరీ.. ఈ రెండు ప్రొడక్షన్ కంపనీలు టాలీవుడ్ లో వున్న టాప్ హీరోలతో సినిమాలు చేస్తున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ మెగాస్టార్ చిరంజీవి నుంచి యంగ్ హీరో కిరణ్ అబ్బవరం వరకు వరుసగా సినిమాలు నిర్మిస్తోంది.చిరుతో వాల్తేరు వీరయ్య బాలకృష్ణతో 'వీర సింహారెడ్డి అల్లు అర్జున్ తో 'పుష్ప ది రూల్' విజయ్ దేవరకొండతో 'ఖుషీ' కల్యాణ్ రామ్ తో 'అమిగోస్' ఎన్టీఆర్ – ప్రశాంత్ నీల్ ప్రాజెక్ట్.. కిరణ్ అబ్బవరంతో 'మీటర్' వంటి సినిమాలు చేస్తోంది.అయితే భారీ ప్రాజెక్ట్ కోసం కొంత మంది స్టార్ లకు భారీ స్థాయిలో అడ్వాన్స్ లు ఇచ్చేసింది. పవన్ కల్యాణ్ తో 'భవదీయుడు భగత్ సింగ్' చేయాలనుకుంది. అందరికి అడ్వాన్స్ లు కూడా ఇచ్చేసింది కానీ ఇది ఇంత వరకు పట్టాలెక్కకపోవడంతో ఇప్పుడు డైలమాలో పడుతున్నట్టుగా తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ ప్రకటించి రెండేళ్లవుతున్నా ఎంతకీ ముందుకు కదలకపోవడంతో పవన్ కు ఇచ్చిన అడ్వాన్స్ ని రిటర్న్ తీసుకుంటున్నారని వార్తలు వినిపిస్తున్నాయి.ఇదే తరహాలో టాలీవుడ్ లో భారీ సినిమాలకు శ్రీకారం చుట్టిన సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ.






Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989